# మధుబాబు

# డాగర్ ఆఫ్ షాడో



MVS
PUBLICATIONS

# డాగర్ ఆఫ్ షాడో

రచన

మధుబాబు

ప్రథమ ముద్రణ:జనవరి, 1995

# ముందుమాట!

ఇంతకుముందు విడుదల అయిన షాడో అడ్వెంచర్ చిచ్చరపిడుగు చదవని వారికోసం, చదివి మరిచిపోయిన వారికోసం ఈ ముందుమాట వ్రాస్తున్నాను.

కలకత్తా కాళి ఉత్సవ విగ్రహాన్ని అపహరించిన దొంగల్ని పట్టుకొని విగ్రహాన్ని తీసుకువచ్చే బాధ్యత షాడో ముఖేష్ లకు అప్పగించబడుతుంది. దొంగలు భారతదేశాన్ని వదిలి ఆస్ట్రేలియా దేశపు సమీపంలోని పిరోనా అరణ్యాలలోకి పారిపోతారు.

పట్టినపట్టు వదలకుండా వెంటపడిన షాడో ముఖేష్ లకు అరణ్యపు అంచుల్లో ఒక మర్రిచెట్టు, దాని క్రింద ఒక గుడిశె, ఆ గుడిశె ముందు ఒక వృద్ధురాలు కనిపిస్తుంది. చిత్రవిచిత్రమైన అనుభవాలను చవి చూపించే ఆ అడవిలోకి వెళ్ళవద్దని వెళ్ళినవాళ్ళు, ఎవళ్ళూ ప్రాణాలతో తిరిగి రాలేదనీ హెచ్చరిస్తుంది.

ఆ మాటల్ని ఖాతరు చేయకుండా అరణ్యంలోకి అడుగు పెడతారు షాడో ముఖేష్. ఒకచోట తమకు కావాల్సిన దొంగల్ని చూస్తారు. వారిని ఎదిరించి ఒక ఎయిర్ బేగ్ లో దాచబడిన కాళికాదేవి విగ్రహాన్ని స్వాధీనం చేసుకోకముందే ఒక బ్లాక్ లియోపార్డ్ బారినపడి

ప్రాణాలు పోగొట్టుకుంటాడు దొంగల్లో ఒకతను. నరమాంస భక్షణచేసే విషపు చెట్టుకు బలైపోతాడు రెండో దొంగ.

అదే చెట్టుకు దొరికి, కొనప్రాణాలతో బయటపడతాడు షాడో కూడా. మొదటి దొంగను చంపిన బ్లాక్ లియోపార్డ్ ఎటాక్ చేస్తుంది అతికష్టంమీద దాన్నికూడా హతమార్చి విగ్రహం దాచబడిన ఎయిర్ బేగ్ ని స్వాధీనం చేసుకోబోతూ - అంతుతెలియని ఒక అగాధంలోకి దొర్లుతారు స్నేహితులు ఇద్దరూ.

కనులు తెరిచి చూసేసరికి ఒక విచిత్రమైన లోకం వారి ఎదుట ప్రత్యక్షం అయివుంటుంది. వారితోపాటు అగాధంలోకి జారి ఎయిర్ బేగ్ మాత్రం మాయమైపోతుంది.

ఎయిర్ బేగ్ కోసం వెదుకుతూ రాచరికపు యుగంలో చిత్రదుర్గం అనే పట్టణాన్ని చేరుకుంటారు స్నేహితులు ఇద్దరూ. అక్కడ పళ్ళు ఫలాలు అమ్ముకునే భూపతి కూతురు చంద్రికతో స్నేహంచేసి ఆమెను అవమానించ చూసిన దళపతి బృందాన్ని పారద్రోలుతారు.

కూతురు అభిమానాన్ని కాపాడినందుకు కృతజ్ఞతతో వారికి ఆశ్రయం ఇస్తాడు భూపతి. తన కూతుర్ని ప్రేమిస్తున్న నిశంభుడనే రాజోద్యోగికి చెప్పి షాడో, ముఖేష్ లను రాజుగారి కొలువులో చేర్పిస్తాడు.

రాజనర్తకి నళినిదేవి మెడలోని ఒక పచ్చలపతకం మీద కలకత్తా కాళి బొమ్మను చూస్తాడు షాడో. మహారాణి మెడలో కూడా అటువంటి పతకమే వుండటాన్ని గమనిస్తాడు.

రాజకుమారి రంజనిని, రాజనర్తకి నళినీదేవిని రణదుర్గానికి చెందిన అగర్వుడు కిడ్ నాప్ చేయిస్తాడు. వారిద్దరినీ విడిపించుకు రావటం కోసం వెళ్ళి సైనికుల మధ్య చిక్కుబడిపోతాడు షాడో.

మహారాణి మెడలోని పచ్చల పతకాన్ని అపహరించటానికి ప్రయత్నించి ముఖేష్ పట్టుబడిపోతాడు. ద్రోహి అని ముద్రవేయించు కుంటాడు.

అతనికి ఆశ్రయం ఇచ్చిన భూపతికి, రాజకొలువులో స్థానం కల్పించిన నిశంభుడికి ఉరిశిక్ష విధించబడుతుంది.

చిచ్చరపిడుగులో సవివరంగా చెప్పబడిన ఈ కథకు కంటిన్యూయేషన్ ఇప్పుడు మీరు చదవబోతున్న డాగర్ ఆఫ్ ది షాడో మీకు నచ్చుతుందనే ఆశిస్తూ— అభినందనలతో

— మధుబాబు.

## డాగర్ ఆఫ్ షాడో

ఉరిశిక్ష విధించబడిన నేరస్థుల్ని ఇతర నేరాలకు జైలుశిక్ష విధింపబడిన ఖైదీలతో కలపరు. వారిని విడిగా నిర్మించబడిన ఒక ప్రత్యేకమైన గదిలో బంధించి వుంచుతారు.

నల్లరాతితో నిర్మించబడిన ఒక పెద్ద గదిలో భూపతిని, నిశంభుడిని కూర్చోబెట్టి తలుపులు మూశారు సైనికులు. రాజసభ నుంచి తీసుకువచ్చేటప్పుడు వారి కాళ్ళకు, చేతులకు తగిలించిన ఇనుప గొలుసుల్ని తీసేశారు. ముఖేష్ కరచరణాలను బంధించి వుంచిన సంకెళ్ళను మాత్రం విప్పలేదు. అతన్ని ఇంకో ప్రత్యేకమైన గదిలో ఒంటరిగా కూర్చోబెట్టారు.

'నా బంధనాలను ఎందుకని సడలించటం లేదు? భూపతి నిశంభుల సంకెళ్ళు ఎందుకు తొలగించారు? వాళ్ళకి ఒక న్యాయం నాకు ఇంకో న్యాయమా? ఇది వట్టి అన్యాయం!' ప్రపంచంలోని కోపాన్నంతా కంఠంలోకి తెచ్చుకుంటూ బిగ్గరగా అరిచాడు ముఖేష్.

చేతిలోని బరిశెను ఎత్తి అతని ముఖం మీద కొట్టబోయి ఎందుకనో ఆఖరిక్షణంలో ఆగిపోయాడు అతన్ని గదిలోకి నెట్టిన సైనికుడు. బహుశా ముష్టియుద్ధంలోను, గదాయుద్ధంలోనూ చిత్రదుర్గ వీరులను అతను చిత్తు చేసిన పద్ధతి గుర్తుకువచ్చి వుండవచ్చతనికి.

'నీవంటి ద్రోహికి సహాయం చేయటానికి ప్రయత్నించి అనవసరంగా రాజుగారి ఆగ్రహానికి గురైనారు భూపతి, నిశంభుడు నమ్మి చేరదీసిన వారికి ద్రోహం తలపెట్టే నీకు కాళ్ళు, చేతులకు సంకెళ్ళు ఉండితీరాల్సిందే. ఇది మంత్రిగారి ఆజ్ఞ' కోపంగా అంటూ గది తలుపుల్ని మూశాడు ఇంకో సైనికుడు.

తలుపులకున్న ఇనుప వూసల మధ్యలో నుంచి అవతలి గదిలోని భూపతిని నిశంభుడిని చూశాడు ముఖేష్.

తలలు వంచుకొని కూర్చున్నారు వారిద్దరూ. తమకు పట్టిన దుర్గతిని తలుచుకొని కుమిలిపోతున్నారు.

ఒక్క క్షణంపాటు వికలమైపోయింది ముఖేష్ అంతరంగం. తన మూలంగానే వారికి ఆ గతి పట్టిందన్న బాధతో చలించిపోయింది అతని హృదయం. తను చేసిన పనిలో వీరిద్దరికీ ఎటువంటి పాత్రా లేదని, వారిద్దరూ అమాయకులనీ గొంతెత్తి అరవాలనిపించిందిగాని ఆ అరుపులు వినిపించుకునేందుకు ఆ గది ముందు ఎవరూ లేకపోవటంతో ఆ కోరిక తనలోనే అదుముకొని గది చివరవున్న నులకమంచం మీద మేనువాల్చాడు.

ఒక అరగంట గడిచిన తరువాత అవతలి గది ముందు ఏదో అలికిడి అవటంతో తిరిగి తలుపుల దగ్గరకి వచ్చాడతను.

జైలు అధికారి అనుమతి తీసుకొన్నది కాబోలు భర్తను నిశంభుడిని చూడటానికి వచ్చింది భూపతి భార్య. తలుపు ఊచల మధ్యలో నుంచి భర్త భుజాలను పట్టుకొని బావురు బావురు మని ఏడుస్తుంది.

కన్నీటితో మిళితమైన ముఖాన్ని పమిటచెంగుతో తుడుచుకుంటూ ఆమె ప్రక్కనే నిలబడివున్నది చంద్రిక. తన గది తలుపుల దగ్గిర ప్రత్యక్షమైన ముఖేష్ ని చూడగానే పట్టరాని కోపంతో ఎరుపు రంగును పులుముకున్నాయి ఆమె కనులు.

'నీవంటి వాడికి ఉరిశిక్ష ఒక్కటీ సరిపోదు. ఒక్కసారిగా చంపితే నీకు బుద్ధిరాదు. బ్రతికి వున్నంతకాలం కొంచెం, కొంచెం చంపుతూ వుండాలి. నువ్వు చేసిన ద్రోహానికి సరైన శిక్ష అదొక్కటే' విసవిసా అడుగులు వేస్తూ అతని గది ముందుకువచ్చి ఆవేశంగా అన్నది.

'మీ నాన్నకు, నిశంభుడికి నా మూలంగా కలిగిన అసౌకర్యానికి ఎంతగానో బాధపడుతున్నాను చంద్రికా. తెలివితేటలున్న దానివి నువ్వు. అందరి మాదిరిగా ఆవేశపడి అనుచితమైన మాటలు మాట్లాడటం మంచిగా లేదు. మీ వాళ్ళ మీద పడిన నిందను తొలగించి, ఎవరి ఆజ్ఞల మూలకంగా ఉరిశిక్షను అనుభవించ బోతు న్నారో వారి ద్వారానే అమోఘమైన సన్మానాలు చేయిస్తాను. నా మాట నమ్మి నాకు ఒక చిన్న సహాయం చేయి' లో గొంతుకతో ఆమెకు మాత్రం వినిపించేటట్లు అన్నాడు ముఖేష్.

'ఒకసారి చేసిన సహాయం మా కుటుంబాన్ని రచ్చకు ఎక్కించి మా బ్రతుకుల్ని ఉరిశిక్షల దాకా తీసుకువచ్చింది. ఇంకోసారి మీ మాటల్ని నమ్మితే పూర్తిగా పతనమైపోతాం మేము. ఈసారి నాకు మా అమ్మకు శిక్షలు పడక మానవు!' అంటూ గిర్రున వెనుతిరిగింది ఆమె అవతలికి వెళ్ళిపోవటానికి.

'చంద్రికా...ప్లీజ్ ...ఒక్కసారికి నా మాట విను. ఈ ఒక్కసారికి నన్ను నమ్మి నేను చెప్పినట్లు చేయి' కాస్తంత గొంతును పెంచి అభ్యర్ధించాడు ముఖేష్ .

ఈసారి అతని మాటలు భూపతికి, అతని భార్యకు, నిశంభుడికి వినిపించాయి. తమ బాధను దిగమ్రింగుకొని విచిత్రంగా చూశారు వాళ్ళు అతనివైపు.

'రాణీగారి మెడలోని పచ్చలపతకాన్ని నేను దొంగిలించటానికి ప్రయత్నించిన మాట వాస్తవం. అందులో ఎటువంటి అసత్యమూ లేదు. అయితే ఆ పని ఎందుకు చేయవలసి వచ్చిందో మీకు చెప్పినా అర్ధంకాదు. కాబట్టి ఆ ప్రయత్నం నేను చేయటంలేదు. నా మూలంగా మీకు విధించబడిన శిక్షను రేపు ఉదయానికల్లా రద్దు చేయించే బాధ్యత నాది. ఆ విషయంలో మీరు ఎటువంటి బెంగా పడవలసిన అవసరం లేదు. చంద్రికను ఇంటికి వెళ్ళగానే మా పాత దుస్తుల మధ్యవుండే చిన్న మెటల్ కేసును బయటకి తీయమనండి' ఆ చుట్టుపట్ల ఎవరైనా సైనికులు వుంటే తన మాటలు అనవసర మైన

కష్టాలు కొని తెస్తాయని తెలిసికూడా తెగించి భూపతికేసి చూస్తూ అన్నాడు ముఖేష్.

'మెటల్ కేసా? అంటే ఏమిటి?' అతని మాటలు విపరీతమైన ఆశ్చర్యాన్ని కలుగచేస్తుండగా అడిగాడు భూపతి.

తన మతిమరుపుతనానికి సిగ్గుపడి నెత్తిమీద టపటపా బాదుకున్నాడు ముఖేష్.

'మెటల్ కేసంటే రెండు వేళ్ళ వెడల్పున, ఒక వేలిమందాన వుండే చిన్న లోహపు పేటిక. నేను మీ ఇంటికి వచ్చినపుడు ధరించివున్న దుస్తులలో వుంటుంది' గబగబా చెప్పాడు.

చంద్రిక వైపు చూశాడు భూపతి. 'అతగాడి మాటలు బాగా గుర్తుపెట్టుకో' అని హెచ్చరించాడు.

'ఇంత జరిగిన తర్వాత కూడా అతడ్ని నమ్ముతున్నావా నాన్న?' ఆశ్చర్యంగా అడిగింది చంద్రిక.

'ఇంతవరకు నమ్మినవాళ్ళం ఇంకా కొంచెం నమ్మితే వచ్చే నష్టం ఏమీలేదు. అతను చెప్పినట్లు చేయి చంద్రికా... ఎదురుప్రశ్నలు వేయకు' ఉన్నట్లుండి కల్పించుకుని గంభీరంగా అన్నాడు నిశంభుడు.

అతనుకూడా అలా మాట్లాడేసరికి ఎదురుచెప్పలేక పోయిందామె. తన కోపాన్ని తనలోనే దాచుకొని ముఖేష్ వైపు తిరిగింది.

'నీకు చెప్పిన లోహపు పేటిక మధ్య భాగంలో ఒక ఎరుపురంగు మీట వుంటుంది. దానిమీద నీ చూపుడువేలితో మూడుసార్లు అదిమితే ఆ మీట ప్రక్కన ఎర్రటి వెలుగు కనిపిస్తుంది. అప్పుడు ఆ పేటికను మీ పెరటిలో వున్న పూలచెట్ల మధ్య పెట్టు...తెల్లవారేదాకా దాని జోలికి పోవద్దు. అక్కడినించి దాన్ని కదిలించవద్దు' తన మాటలు వినటానికి అందరూ అంగీకరించినందుకు అమితంగా సంతోషపడుతూ చెప్పాడు ముఖేష్.

'అలా చేసినందువల్ల ఉపయోగం ఏముంటుంది?' అతను ఊహించనివిధంగా ఎదురుప్రశ్న వేసింది చంద్రిక.

'తెల్లవారేసరికి మీ తండ్రి జైలునుండి విడుదలై ఇంటికి వస్తాడు. నిశంభుడు కూడా అతని వెంట వుంటాడు' అన్నాడు ముఖేష్.

ఆ మాటలు చంద్రికకు అర్థంకాలేదు. ఇంకో ప్రశ్న వేసేదేకాని అంతవరకూ అవతల ఎక్కడో వున్న ఇద్దరు సైనికులు అక్కడికి వచ్చి ఆమెను, ఆమె తల్లినీ అక్కడనుంచి కదలమని ఆదేశించారు.

'కాలాలు మారినా, నాగరికతలు మార్పుచెందినా ఈ జైళ్ళలోని ఆచారాలు మాత్రం ఒక్కమాదిరిగానే వున్నాయి. ఇసుమంత కూడా మారలేదు' ఉసూరుమంటూ తనలోతను అనుకొని, తన నులక మంచం వైపు కదిలాడు ముఖేష్.

* * *

ఇంటికిపోగానే ముఖేష్ చెప్పినట్లు అతని దుస్తుల్ని వెతికి మెటల్ కేసును బయటికి తీసింది చంద్రిక. సన్నగా వెండితో తయారుచేసినట్లు మిలమిలా మెరిసిపోతున్న ఆ పెట్టెలో ఏముందో చూడాలని అనిపించింది కాని, దాన్ని తెరిచే విధానం తెలియక పోవటంవల్ల, ఆ ఆలోచనను విరమించుకొని, అతను చెప్పినట్టే దాని మధ్యభాగంలో వున్న ఎర్రటి మీటను మూడుసార్లు అదిమింది.

సి.ఐ.బి. స్పెషల్ ఎఫెక్ట్స్ బృందం తయారుచేసిన బీపర్ మెషీన్ అది. బటన్ ప్రెస్ అవగానే సన్నటి శబ్దంతో పనిచేయటం మొదలు పెట్టింది అందులోని వైర్ లెస్ ట్రాన్స్ మీటర్ . అందుకు గుర్తుగా బటన్ ప్రక్కన వున్న రెడ్ లైట్ వెలిగింది.

అది తన చేతుల్లోనుంచి తనంతటతానే ఎగిరిపోతుందేమోనని భయపడింది చంద్రిక. పరుగులాంటి నడకతో పెరటిలోకిపోయి ముఖేష్ చెప్పినట్లుగానే దాన్ని పూలచెట్ల మధ్య పెట్టింది.

అలా బయటికి రాగానే నలుదిక్కులకు ప్రయాణం చేయటం మొదలుపెట్టాయి ఆ మెటల్ కేసులో నుంచి వెలువడుతున్న మైక్రోవేవ్ సంకేతాలు.

ఆ విషయం తెలియని చంద్రిక తల వంచుకొని తనదారిన తను ఇంట్లోకి వెళ్ళి తలుపులు మూసింది.

* * *

'రాజకుమారిని, రాచనర్తకిని అపహరించిన మరుక్షణం నువ్వుగాని, నీ జతగాడుగాని మా రణదుర్గానికి రావచ్చని ముందుగానే ఊహించాను. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకొని ఎదురుచూస్తున్నాను' కత్తిని గాలిలో తిప్పుతూ షాడో ఎదుటికి వచ్చిన రణదుర్గాధిపతి అగర్వుడు అన్నాడు.

రాచరికపు యుగంలోని వాళ్ళు ఇరవై ఒకటో శతాబ్దంలోని వాళ్ళకంటె తెలివితేటల్లో చాలా తక్కువవాళ్ళని పొరపాటు పడినందుకు తననుతనే నిందించుకుంటూ అతని ముఖంలోకి చూశాడు షాడో.

'నిన్ను బంధించినట్లే నీ జతగాడిని కూడా బంధించి మీ ఇద్దర్నీ ఒకేసారి యమసదనానికి పంపించాలని వుంది గాని, కంటపడిన శత్రువును, కాళ్ళకు అడ్డుపడిన పామును అప్పటికప్పుడు విరగడ చేసుకోవటం మంచిదనే మాట ప్రకారం నిన్ను ఇప్పుడే హత మార్చాల్సి వస్తోంది' అంటూ చేతిలోని కత్తిని ఎత్తి షాడో గుండెలమీద పొడవబోయాడు అగర్వుడు.

కెవ్వున అరిచి స్పృహతప్పి పడిపోయింది - ఒక గవాక్షం నుంచి ఆ దృశ్యాన్ని చూసిన రాజకూమారి. ఆమె క్రింద పడిపోకుండా పొదవిపట్టుకొని అలాగే బొమ్మలా నిలుచున్నది నళిని.

విచ్చుకత్తులతో చుట్టూ నిలబడిన సైనికుల్నిగాని, మీదికి రాబోతున్న అగర్వుడి ఖడ్గాన్ని గాని తప్పించుకోవటం అసాధ్యమని

అర్థమైపోయింది షాడోకి. నవ్వుతూ నవ్వుతూ ప్రారంభమైన ఆ విచిత్రమైన అనుభవం విషాదంగా ముగియబోతున్నందుకు కొంచెం బాధగానే అనిపించి, కళ్ళను గట్టిగా మూసుకోబోయాడు.

అదే సమయంలో ఈలవేసినట్లు ప్రారంభం అయింది ఒక శబ్దం. ఎవరో వెంటపడి తరుముతున్నట్లు ఆగి ఆగి కంటిన్యూ కాసాగింది అది.

ముందుకు విసరబోతున్న ఖడ్గాన్ని మధ్యలోనే వెనక్కి లాక్కుని చుట్టూ చూశాడు అగర్వుడు.

'ఏమిటది? ఏమిటా శబ్దం? ఎక్కడినించి వస్తోంది?' కలవరపడుతూ ప్రశ్నించాడు సైనికుల్ని.

అతని మాదిరిగానే అబ్బురపాటుతో చుట్టూ చూస్తున్నారు వాళ్ళు.

కళ్ళు మూసుకునే ఆలోచన శబ్దం స్టార్ట్ అయిన మరుక్షణం షాడో అంతరంగంలోనుంచి ఎటో ఎగిరిపోయింది.

అతని దుస్తుల్లో వున్నది ముఖేష్ యాక్టివేట్ చేసిన బీపర్ వంటి మరో మెటల్ కేసు. చిత్రదుర్గం నుంచి ప్రయాణం చేసి వస్తున్న సిగ్నల్స్ ని ఆకర్షించి షాడోకి హెచ్చరికల్ని అందజేస్తుంది.

మిన్ను విరిగి మీదపడే ప్రమాదం ఏదైనా ఎదురైనప్పుడు తప్ప మామూలు పరిస్థితుల్లో ఉపయోగించ కూడని సాధనాలు అవి

ముఖేష్ ఏదో పెద్ద ట్రబుల్ లో చిక్కుపడిన విషయం అర్థమయ్యే సరికి ఝల్లుమన్నది షాడో శరీరం. అతనికి తెలియకుండానే కదిలాయి అవయవాలు. చుట్టూ నిలబడిన సైనికుల చేతుల్లోని విచ్చుకత్తులుగాని, ఎదుటవున్న అగర్వుడి ఆయుధంగాని తన వంటికి తగిలితే ప్రాణాలు పోతాయనే సంగతిని విస్మరించి మెరుపులా అవతలికి దూకాడతను.

'పట్టుకోండి ... వాడిని పట్టుకోండి' అదిరిపడి సైనికుల్ని హెచ్చరించాడు అగర్వుడు.

అవతలికి దూకిన మరుక్షణం తొడచరిచి ఎడమపాదంతో క్రింద వున్న గచ్చును బలంగా తన్నాడు షాడో. గుండెలు అదిరిపోయేటట్లు కుంగ్ ఫూ షౌట్ చేస్తూ డెలివర్ చేశాడు ఒక ఫ్రంట్ కిక్ ని.

అంతకుముందు ఏనాడూ కనీవినీ ఎరుగని ఆ విచిత్రమైన పొలికేకను తిలకించి నిశ్చేష్టులైపోయారు సైనికులు. వాళ్ళు ఆ అయోమయం నుంచి తేరుకోక ముందే ఒక సైనికుడి తలకు తగిలింది షాడో పాదం.

ఫట్ మని శబ్దంచేస్తూ రెండుగా విచ్చింది తల. షాడో చేసిన షౌట్ కంటె వికృతంగా అరిచి అలాగే క్రిందికి దొర్లాడా సైనికుడు.

అదిచూసి మరింతగా డిసింగ్రేట్ అయిపోయారు మిగిలినవారు. ఒకరికొకరు హెచ్చరించుకుంటూ తలా ఒక పక్కకు పరుగులు

తీయబోయారు. గాలిలోకి లేచిన పాదం గచ్చుకు ఆనగానే ఇంకో జంప్ చేసి వారిమీదికి పోయాడు షాడో...వన్ టూ... వన్ టూ అని లెక్కపెడుతూ ఎడాపెడా డెలివర్ చేశాడు ఇంకో నాలుగు కిక్స్ ని.

ముక్కులూ ముఖాలు ఏకం అయిపోయాయి ఇద్దరికి. భుజం ఒకటి ఎందుకూ పనికిరానంతగా విరిగిపోయింది మరొకడికి. రాక్షస హస్తం ఏదో గట్టిగా పట్టుకొని అవతలికి విసిరేసినట్లు అల్లంత దూరంలో పడిపోయాడు నాలుగో సైనికుడు.

స్పృహతప్పిన రాజకుమారిని అలాగే పొదవి పట్టుకొని విప్పారిన నేత్రాలతో చూస్తోంది నళినీదేవి.

ఎందరో వీరుల్ని గతంలో చూసి వున్నదామె. చుట్టుముట్టిన శత్రువుల్ని అవలీలగా విదిలించికొట్టగల మొనగాళ్ళను గురించి ఎన్నెన్నో కథలు వినివున్నది.

ఎటువంటి ఆయుధము లేకుండా కేవలం తన పాదాలనే ఆయుధాలుగా మార్చి అంతంత దెబ్బలు కొట్టగల వారిని చూడటం మాత్రం అంతవరకూ జరగలేదు. అసలు అటువంటి శక్తిగలవాళ్ళు ప్రపంచంలో వుంటారని కూడా ఆమెకు తెలియదు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో కుప్పకూలిపోయిన తమ సహచరుల్ని చూసుకునేసరికి దిగజారి పోయింది మిగిలిన సైనికుల

ధైర్యం. గావుకేకలు పెడుతూ ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా పారిపోయారు వారందరూ.

వారితోపాటు తనుకూడా మాయం అవుతున్న అగర్వుడిని పట్టుకొని అక్కడికక్కడ అప్పటికప్పుడు మట్టికరిపించటం చాలా మంచిదని అనిపించినా, ఆ పని చేయలేదు షాడో.

పారిపోతున్న వాళ్ళు అరిచే అరుపుల్ని విని దుర్గంలో వున్న బలగాలన్నీ అటుకేసి వచ్చేస్తాయి. ఏదో ఒకటి చేసి వారందర్నీ జయించగలడు తను. కాని అందుకు చాలా టైమ్ వేస్ట్ అవుతుంది అవతల ముఖేష్ ఎటువంటి ప్రమాదంలో చిక్కుకున్నాడో తెలుసుకోకుండా సమయాన్ని వృధా చేసుకోవటం మంచిదా?

అగర్వుడు కూడా అవతలికి పారిపోయిన మరుక్షణం నళినీదేవి నిలుచున్న ప్రదేశం వైపు జంప్ చేశాడతను.

'సమయానికి వచ్చి నా మానాన్ని, మా ప్రాణాల్ని కాపాడిన నీకు మా కృతజ్ఞతలు ఏవిధంగా తెలియచేసుకోగలం?' రాజకుమారిని ఒకచేత్తో పట్టుకుని రెండో చేత్తో అతనికి అభివాదం చేస్తూ మధురాతిమధురంగా అడిగింది నళినీదేవి.

'కృతజ్ఞతలు తెలియచేసుకునే మార్గం కనిపించకపోయినందువల్ల ఇప్పుడు నష్టం ఏమీలేదుగాని, లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్ ' అంటూ ఆమె దగ్గర్నించి రాజకుమారిని అలవోకగా

అందుకుని అమాంతం భుజంమీద వేసుకున్నాడు షాడో. నళినీదేవి సమాధానం కోసం ఎదురుచూడకుండా వచ్చినదారినే దుర్గం బయటికి బయలుదేరాడు.

అతను ఊహించినట్లే అరుపులతో అల్లకల్లోలం అయిపోతుంది రణదుర్గం. 'శత్రువులు దుర్గంలో ప్రవేశించారు ... శత్రువులు... శత్రువులు' అని కేకలు పెడుతున్నారు కొందరు సైనికులు. బ్రహ్మాండమైన యుద్ధభేరీ ఒకటి చెవులు చిల్లులు పడిపోయేటట్లు మ్రోగటం మొదలుపెట్టింది.

పూలతోటను దాటి కోట గోడమీదికి చేరుకోబోతున్న సమయంలో షాడోని గమనించారు నలుగురు సైనికులు. గమనించిన మరుక్షణం గుండెలు అదిరిపోయేటట్లు అరిచి అందర్నీ హెచ్చరించారు.

భగభగలాడుతున్న కాగడాలు పట్టుకొని ఉసుళ్ళ తెరల మాదిరి అటుగా వచ్చేస్తున్న సైనికుల గుంపుల్ని చూసేసరికి నిరాశా నిస్పృహలతో క్రుంగిపోయింది నళినీదేవి.

'ప్రాణాలతో ఇక్కడినుంచి బయటపడలేము. మమ్మల్ని వదిలి నీ ప్రాణాలు కాపాడుకో. కోట గోడ దూకి పారిపో' అంటూ నడకను ఆపి ఎక్కడిదక్కడ ఆగిపోయింది.

లాగిపెట్టి ఆమె చెంపమీద కొట్టాలన్న కోరికను అతి బలవంతం మీద అదుముకుంటూ పరిస్థితిని సమీక్షించుకున్నాడు షాడో.

'కొట్టండి .. వాడ్ని పడగొట్టండి' సైనికుల వెనుక భాగంలో ఎక్కడో నిలబడి బొంగురు కంఠంతో ఆజ్ఞ ఇస్తున్నాడు అగర్వుడు.

సమీపంలోకి రాకుండా అల్లంత దూరంలో నిలబడి బరువైన యుద్ధబాణాలను బయటికి తీస్తున్నారు సైనికులు.

రెండు వందల గజాల దూరం అవలీలగా అతివేగంగా ప్రయాణం చేయగల ఆ యుద్ధబాణాల్లో ఏ ఒక్కటి తగిలినా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవటం తథ్యమని గ్రహించి, దుస్తుల్లో చేయిపెట్టాడు షాడో. అతి భద్రంగా దాచిన లిటిల్ టామీని బయటికి తీశాడు.

అటువంటి ఆయుధాలను కలలో కూడా చూసివుండని ఆ అమాయకులమీద అతి భయంకరమైన ఆ మినీ బాంబును ప్రయోగించటానికి అంగీకరించలేదతని అంతరంగం.

అయినా అంతకంటె మరో మార్గం ఏముంది?

'పారిపో ... మమ్మల్ని వదిలి నువ్వు నీ ప్రాణాలు కాపాడుకో' అంటున్న నళినీదేవి అతని ముఖంలోని భావాలను గమనించి మాటల్ని మింగేసింది.

మొదటి యుద్ధ బాణం గాలిలోకి వేస్తున్న సమయంలో లిటిల్ టామీ మీది బుడిపెను నొక్కి శక్తికొద్దీ ముందుకు విసిరాడు షాడో.

'చెవుల్ని గట్టిగా మూసుకో ... కళ్ళను కూడా ' అని నళినీదేవిని హెచ్చరించి తలను క్రిందికి వంచుకున్నాడు.

గాలిలోకి లేచిన మొదటి యుద్ధబాణం అతని తలకు ఆరంగుళాల దూరంలో నుంచి అవతలికి దూసుకుపోయింది.

'కొట్టండి ... గురిచూసి పడగొట్టండి' అని అరుస్తున్న అగర్వుడికి గాని, అతని సైనికులకుగాని తమ మీదికి వచ్చేసిన లిటిల్ టామీ కనిపించలేదు.

వంద యుద్ధబాణాలు ఒకేసారి గాలిలోకి లేవబోతున్న సమయంలో సైనికుల మధ్యనపడి ఆకాశం పగిలిపోయినంత శబ్దం చేస్తూ బ్రద్దలైంది లిటిల్ టామీ.

అది పడిన ప్రదేశంలో ఆరడుగుల లోతున ప్రత్యక్షమయింది పెద్ద గోయి. ఆ చుట్టుపట్ల ప్రాణాలతో వున్న సైనికులు ఎవరూ మిగలలేదు.

అంతకుముందు అరక్షణం వరకూ ఆవేశపూరితమైన అట్టహాసాలతో ప్రకంపించిన ఆ ప్రదేశంలో శ్మశాన నిశ్శబ్దం ఇప్పుడు ప్రత్యక్షం అయింది. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో భస్మీపటలం అయిన తమ సహచరుల్ని చూసుకునేసరికి విపరీతమైన భయంతో వణికిపోతూ వెనక్కి పారిపోయారు లిటిల్ టామీ దెబ్బ తగలనివాళ్ళు.

అగర్వుడు కూడా వీళ్ళల్లో వున్నాడో లేక మరణించిన వారి మధ్యలో వున్నాడో తెలుసుకోవాలన్న కోరికను మనసులోనుంచి

బలవంతంగా నెట్టివేస్తూ, నళినీదేవిని హెచ్చరించి కోటగోడను దాటాడు షాడో.

అదిలించే వాళ్ళుగాని, అడ్డుకునే సైనికులుగాని ఎవరూ లేకపోవటంతో తాపీగా చెట్లతోపులోకి పోయి, అక్కడ వదిలిన అశ్వాలను ప్రయాణానికి సిద్ధంచేశాడు.

'అది ... ఆ సైనికులమీద నువ్వు ప్రయోగించిన అస్త్రం ఏమిటి? బ్రహ్మాస్త్రమా? పాశుపతాస్త్రమా?' ఆశ్చర్యంగా చూస్తూ అడిగిందతన్ని నళినీదేవి.

'ఆ రెండింటికీ కాస్తంత దగ్గర బంధువు ... లిటిల్ టామీ అంటారు దాన్ని' ఆమెను ఒక అశ్వంమీదికి చేరుస్తూ అన్నాడు షాడో.

'గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్ అంటే ఏమిటి?' మరో ప్రశ్న వేసింది నళినీదేవి.

'షట్ యువర్ బ్లడీ మౌత్ .'

ఆ మాట కూడా అర్దం కాకపోవటంతో, అర్థం తెలియకపోయినా నోటిని గట్టిగా అదుముకున్నది నళినీదేవి అతని విసుగుదలను గమనించి.

స్పృహలేని రాజకుమారిని తన అశ్వంమీద కూర్చోబెట్టి గట్టిగా పట్టుకున్నాడు షాడో. ఆమె కోసం తీసుకువచ్చిన అశ్వం అక్కడే

ఆగిపోకుండా కళ్ళేలను తన అశ్వపు జీనుకు కట్టి ప్రయాణం ప్రారంభించాడు.

చిత్రదుర్గాన్నించి అక్కడికి రావటానికి రెండు రోజులు పట్టింది. తిరిగి వెళ్ళే సమయంలో అంత ఆలస్యం జరుగకూడదు.

తను వచ్చిన మార్గాన్ని మనసులోనే మరోసారి మననం చేసుకుంటూ అశ్వాన్ని అదిలించాడు షాడో. కళ్ళేలను ఫ్రీగా వదిలి కాలి మడమలతో బలంగా డొక్కల మీద అదిమాడు.

అతని ఆతృతను అర్ధం చేసుకున్నట్లు గాలిలోకి ఎగిరి అతివేగంగా పరుగులు ప్రారంభించిందా గుర్రం.

* * *

'నీ ఆఖరి కోరిక ఏమిటి?'

సూర్యుడు బారెడుదూరం పైకి వచ్చిన తర్వాత ముఖేష్ ని బంధించిన గది ముందుకు వస్తూ అడిగాడు సర్వసైన్యాధిపతి.

చంద్రిక ద్వారా తను పంపిన డిస్ట్రెస్ సిగ్నల్ షాడోకి అందిందో లేదో ముఖేష్ కి తెలియదు. ఒకవేళ అందినా, అందుకు సరైనా సమయానికి రాగలడో లేదో అతనికి తెలియదు. అతను రాలేకపోతే తను ఏం చెయ్యాలో తనంతట తనుగా నిర్ణయించుకోలేక తనలో తను మధనపడిపోతున్నాడతను.

అవసరం అయితే అప్పటికప్పుడు ఆ చెరసాలలో నుంచి తప్పించుకోగలననే ధైర్యం అతనికి వుంది.

తప్పించుకోవటంతో పరిష్కరించబడదు తమ సమస్య. భూపతి, నిశంభులు నిర్దోషులని నిరూపించబడాలి... ఎలా?

షాడోవచ్చి తన డైలమాకు పరిష్కారం చెపుతాడని అతని ఆశ. వరుసచూస్తుంటే ఆ ఆశ నిరాశ అయ్యేటట్లు కనిపిస్తుంది.

'ఆఖరి కోరిక ఏమిటని అడిగితే అలా నోరు తెరుచుకు చూస్తావేమిటి? వళ్ళు ఎలా వుంది?' ఎంత సేపటికీ అతను సమాధానం చెప్పకపోవటంతో కోపంగా అన్నాడు సర్వసైన్యాధిపతి.

'వళ్ళు ఎలావుంటే నీకెందుకు? నువ్వు ఏం చెయ్యగలవు? ప్రాణాలు తీస్తావా?' ఉన్నట్లుండి ఎగుసుకు వచ్చిన కోపాన్ని అదుపులో పెట్టుకోవటం చేతకాక విసురుగా అన్నాడు ముఖేష్.

పళ్ళు పటపటమని కొరుకుతూ వరలోవున్న ఖడ్గాన్ని బయటికి తీయబోయాడు సర్వసైన్యాధిపతి. అంతలోనే తను మాట్లాడు తున్నది మరణశిక్షను విధించబడిన మనిషితో అని గుర్తుకు వచ్చి ఆగిపోయాడు.

అతని యాక్షన్ ముఖేష్ లో వెంటనే కలిగించిందొక ఆలోచనని మరణశిక్ష విధించబడిన నేరస్థులు ఏదో ఒక పాయింట్ ని అడ్డుపెట్టుకొని కొద్దికాలం ఆ శిక్షను పోస్ట్ పోన్ చేసుకుంటూ వుంటారు

తమ కాలంలో ... అందుకు కోర్టులు, లాయర్లు మొదలైన ఫెసిలిటీస్ తమకున్నాయి.

ఎందుకూ పనికిరాని ఈ అనామక రాచరికపు యుగంలో అవి లేవు. అయినా మరణించబోయే మనిషి ఆఖరి కోరిక తీర్చాలనే నిబంధన ఒకటి ఈ కాలంలో వున్నట్టు కనిపిస్తోంది. దీన్ని అడ్డుపెట్టుకొని షాడో తిరిగి వచ్చేదాకా ఉరిశిక్షను పోస్ట్ పోన్ చేయించుకోగలిగితే?

ఆ ఆలోచన మనసులో అడుగుపెట్టిన మరుక్షణం అమలులో పెట్టేశాడు ముఖేష్.

'మరణించే ముందు ఈ చిత్రదుర్గంలో అపరిమిత బలవంతులని పేరుపొందిన తమతో ఒక్కసారి ముష్టి యుద్ధం చేయటమే నా ఆఖరికోరిక, చేతనయితే తీర్చండి. చేతకాకపోతే నోరు మూసుకొని అవతలికి పొండి. అనవసరమైన ప్రసంగం వద్దు.' నిర్మొహ మాటంగా చెప్పి, తన నులకమంచం దగ్గిరికి వెళ్ళిపోయాడు.

అదిరిపడి అలాగే నిలుచుండిపోయాడు సర్వసైన్యాధిపతి.

అతనితో ముఖేష్ ఏం మాట్లాడుతున్నాడో వినటానికి తమ గది తలుపులు దగ్గిర నిలుచున్న భూపతి, నిశంభులకు తాము వింటున్నది నిజమేనా అని సందేహం కలిగింది.

తనకు పట్టబోతున్న దుర్గతిని తలుచుకొని కుమిలిపోతూ వుండాల్సిన మనిషి సర్వసైన్యాధిపతి వంటి వాడితోనే పరాచికాలు ఆడటమా? అతనికి మతిగాని పోలేదుకదా?

అదేమాట సర్వసైన్యాధ్యక్షుడి మనసులో కూడా మెదిలింది కాబోలు క్రిందినుంచి పైదాకా పట్టి పట్టి చూశాడు ముఖేష్ ని.

'నాకు మతిపోలేదు. నేను ఏం మాట్లాడుతున్నానో నాకు బాగా తెలుసు. రణదుర్గం నుంచి వచ్చిన అహంభావులతో నేను నా జతగాడు సల్పిన పోరాటాన్ని మీరు మర్చిపోయివుంటే, ఒకసారి గుర్తుచేసుకోండి. నాకోరిక సమంజసమో కాదో అర్ధం అవుతుంది' నులకమంచం మీద కాలుమీదకాలు వేసుకొని కూర్చుంటూ అన్నాడు ముఖేష్.

రణదుర్గం నుంచి వచ్చిన వీరుల చేతిలో తను పొందిన పరాభవం ఛట్ మని కనులముందు మెదిలి సిగ్గుతో ఎర్రబారింది సర్వసైన్యాధిపతి ముఖం. షాడో ముఖేష్ లు సల్పిన పోరాటం గుర్తుకువచ్చి స్వల్పంగా కంపించింది అతని శరీరం.

ఆఖరి కోరిక తీర్చుకునే నెపంమీద తనను హతమార్చటమే అతని ధ్యేయమేమో అనే అనుమానం కలిగి వంటిమీద చీమలు జెర్రులు ప్రాకినట్లయింది. అతని మాటలకు సమాధానం ఏమని ఇవ్వాలో అర్ధంకాక విసురుగా వెనుతిరిగి వెళ్ళిపోయాడు అక్కడినించి.

సూర్యుడు అస్తమించే సమయంలో ఉరిశిక్షను అనుభవించ వలసిన ఖైదీలను మధ్యాహ్నా సమయానికి అంతిమ యాత్రకు సిద్ధం చేస్తారు. వారి ఆఖరి కోరికలను తీర్చి ఉరికంబం దగ్గిరికి తీసుకుపోయేందుకు సిద్దంగా నిలబెడతారు.

సాయం సమయం కావటానికి మరో ఘుడియ మాత్రమే వ్యవధి వున్నదనగా కూడా అటువంటి ఏర్పాట్లు ఏవీ జరగపోవటంతో ఆశ్చర్యపడింది జైలు దగ్గిరికి వచ్చిన చంద్రిక.

తెల్లవారేసరికి తన తండ్రిని, నిశంభుడిని నిర్దోషులుగా నిరూపిస్తానని ప్రగల్భాలు పలికి, తనచేత తనకు ఇష్టంలేని పని చేయించిన ముఖేష్ ని రకరకాల నిందావాక్యాలతో ఇష్టం వచ్చినట్లు తిట్టిపోయటానికి నిశ్చయించుకుని మరీ వచ్చిందామె అక్కడికి.

'ముఖేష్ ఏదో మంత్రం వేశాడు. ఉదయం నుంచీ మా దగ్గిరికి ఎవరూ రాలేదు. అసలు ఇవాళ శిక్ష అమలుజరుగుతుందనే నమ్మకం నాకు లేదు' ఆమెను చూడగానే సంతోషంగా అన్నాడు నిశంభుడు.

'శిక్ష నుంచి మిమ్మల్ని తప్పించటం ఒక సమస్య కానేకాదు. మీరు కోరుకుంటే ఇప్పటికిప్పుడు ఈ జైల్లోనుంచి అవతలికి తీసుకు పోగలను. మిమ్మల్ని నిర్దోషులుగా నిరూపించాలన్నదే నా బాధ... అందుకే ఆగుతున్నాను' తలుపుల దగ్గిరే నిలబడివున్న ముఖేష్ వెంటనే అన్నాడు.

'జైలు నుంచి తప్పించుకోవటం మాటలు చెప్పినంత తేలికకాదు. నోరు వున్నది కదా అని కోతలు కోయటం మంచిదికాదు' వెంటనే వెక్కిరించింది చంద్రిక.

మాటలతో సమాధానం ఇవ్వలేదు ముఖేష్ . తన గది తలుపులకున్న ఊచల్ని పట్టుకుని ఊపిరి బిగించాడు.

చంద్రిక చూస్తూవుండగానే మైనపువత్తుల మాదిరి వంగిపోయాయి రెండుచువ్వలు. వాటిమధ్య ఏర్పడిన ఖాళీలో నుంచి అతను గది బయటికి రావటం, నిశంభుడు, భూపతి బంధించబడిన గది ముందుకువచ్చి వారి గది తలుపులకున్న ఊచల్ని కూడా పట్టుకోవటం క్షణాలమీద జరిగిపోయాయి.

'వద్దు...వూచల్ని వంచద్దు. జైలు నుంచి పారిపోయి జీవితమంతా నేరస్థులమాదిరి బ్రతకటం కంటే మరణించి మట్టిపాలవటమే నాకు ఇష్టం' ఆందోళనగా అంటూ ముఖేష్ చేతుల్ని తలుపులమీదినుంచి తొలగించాడు చంద్రిక తండ్రి.

మారు మాటాడకుండా వెనుతిరిగి తన గది ముందుకు వచ్చాడు ముఖేష్. ఊచల మధ్య నుంచి లోపలికి పోయి, వాటిని యధాప్రకారం సరిచేసి ఏమీ తెలియని అమాయకుడి మాదిరి నిలబడ్డాడు.

నోట మాటరాక బొమ్మలా నిలబడిపోయింది చంద్రిక. అతనిలో అంత బలం వుంటుందని ఆమె వూహించలేదు.

'నోరు తెరుచుకొని నిలబడినందువల్ల నీకుగాని మాకుగాని ఎటువంటి కాలక్షేపము జరుగదు. జైలు బయటికిపోయి రాజసభలో ఏం జరుగుతున్నదో తెలుసుకురావటం చాలా మంచిది. నా ఆఖరి కోరికను విని రాజుగారు ఏమంటున్నారో తెలుసుకోవటం వల్ల మనకు ఎంతో ఉపయోగం వుంటుంది' ఆమెను హెచ్చరించాడు ముఖేష్.

వెంటనే అతని మాటను బలపరిచాడు నిశంభుడు. రాజసభకు వెళ్ళి అక్కడి విశేషాలు తెలుసుకురమ్మని చంద్రికకు నచ్చచెప్పాడు.

ముఖేష్ ని తిట్టిపోసే ఆలోచనల్ని విరమించుకొని ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టింది చంద్రిక. సరాసరి రాజసభకు దారితీసింది.

* * *

'రాజద్రోహం చేసిన నేరస్థుడి ఆఖరి కోరికను తీర్చాలన్న నిబంధన సరైనదికాదు. అతని కోరికను నిరాకరించటమే మంచిది' ఖంగుమంటున్న కంఠంతో అన్నాడు యువరాజు శ్రీసేనుడు. అతని మాటల్ని బలపరుస్తున్నట్లు తలవూపాడు మంత్రి కుమారుడు జయపాలుడు.

సభలో ఎటువంటి కలవరము వినిపించకపోవటంతో మంత్రి వైపు తిరిగాడు మహారాజు వీరసేనుడు.

విపరీతమైన ఆలోచనలతో ముడిపడివుంది మంత్రి వదనం.

'మంత్రి మహాశేయులు మౌనం వహించటంలో అర్ధం ఏమిటి? రాజద్రోహం చేసిన నేరస్థుడికి నీతి నియమాలతో పట్టింపు వుంటుందా?' హుందాగా యువరాజు శ్రీసేనుడు అడిగేసరికి చలనం వచ్చింది ఆయనలో.

'నీతి నియమాలు తప్పబట్టి అతను నేరస్థుడు అయినాడు. వాటిని గౌరవించే అభిప్రాయం వుండబట్టి మనం మర్యాదస్థులమని అనిపించుకుంటున్నాం. వ్యక్తిగతమైన కక్షలను మనసులో పెట్టుకొని తరతరాలుగా మనం పాటిస్తున్న ఒక నియమాన్ని ఇప్పుడు వదిలేస్తే లోకం ఏమని అనుకుంటుంది?'

మంత్రిగారి మాటలు తమకు నచ్చినట్లు వెంటనే కరతాళధ్వనులు చేశారు సభికులు. తలలు వూపి మెచ్చుకున్నారు

యువరాజు ముఖం కాంతివిహీనం అవటాన్ని గమనించి వెంటనే ఆసనం మీదినుంచి లేచి నిలబడ్డాడు జయపాలుడు.

ఉరిశిక్ష విధించబడిన ఖైదీ అసమాన బలసంపన్నుడు. ముష్టి యుద్దంలోనూ, గదా యుద్ధంలోను రణదుర్గ వీరుల్నే జయించిన వాడు. అతను మన సర్వసైన్యాధిపతికి ఏదైనా అపకారం తలపెడితే? తనకు ఎలాగూ మరణశిక్ష విధించబడింది కాబట్టి ఆఖరిసారిగా కక్ష తీర్చుకునే ప్రయత్నం చేస్తే?' మహారాజును మంత్రిగారిని వేధిస్తున్న సమస్యనే అతను మాటల్లో అందరికీ తెలియచేశాడు.

అందుకు కూడా ఆమోదం తెలియచేశారు సభికులు. ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో ఎవరికీ తెలియకపోవటం వల్ల సమాధానం మాత్రం ఎవరూ చెప్పలేదు.

పది నిమిషాలు ఆగి తిరిగి జయపాలుడే కల్పించుకున్నాడు.

'గతంలో ఏర్పాటుచేసిన కట్టడులు కాలక్రమంలో ఇబ్బందికరంగా తయారైనప్పుడు, ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న సమస్యవంటి సమస్యలే ఎదురైనప్పుడు, మహారాజు మనకున్న అసాధారణాధి కారాలను ఉపయోగించి సరైన నిర్ణయం తీసుకోవచ్చు. అందుకు ఎవరూ అభ్యంతరం చెప్పలేరు. మరణించబోయే నేరస్థుడి ఆఖరి కోరిక కంటే, మన సర్వసైన్యాధిపతి ప్రాణాలు మనకు చాలా విలువైనవి. కాబట్టి ఆ కోరికను నిరాకరించటమే సముచితం' అంటూ తన ఆర్గ్యుమెంట్ ని ప్రారంభించాడు.

అనర్గళంగా, అభ్యర్దనమైన పదజాలంతో అర్ధఘుడియపాటు కొనసాగిన ఆ ఆర్గ్యుమెంట్ ని విని అంతఃపుర స్త్రీలు కూడా మెచ్చుకోలుగా తలలూపారు.

నేరస్థుడి ఆఖరి కోరికను నిరాకరించటానికే నిర్ణయించాడు మహారాజు వీరసేనుడు.

'నిర్ణయించిన ప్రకారం శిక్ష అమలుజరిగి తీరాలి. అయితే ఈ రోజు మనం నిర్ణయించిన సమయం దాటిపోయింది. కాబట్టి రేపు ఉదయం

సూర్యోదయ సమయంలో పౌరులందరూ చూస్తూ వుండగా వాళ్ళని ఉరితీయాలి' అని తన ఆజ్ఞను అందరికీ వినిపించి సభను చాలించాడు.

సభికులందరికీ చాలా వెనుకగా కూర్చొని ఆ మాటల్ని విన్న చంద్రికకు దుఃఖం ముంచుకు వచ్చేసింది. ముఖేష్ పెట్టిన మెలిక మూలకంగా ఉపయోగం ఏదైనా వుంటుందనీ, శిక్ష మరికొన్ని రోజులు వాయిదా పడవచ్చనీ అనుకున్నదామె. అటువంటిది ఏదీ జరగక పోవటంతో తలవంచుకొని అందరితోపాటు సభను వదిలి బయటికి బయలుదేరింది.

రాజుగారి నిర్ణయం అర్ధఘుడియ తరువాత సర్వసైన్యాధ్యక్షుడే స్వయంగా ముఖేష్ కి వినిపించాడు.

'నీ కోరిక అనుచితం. నీకు రేపు ఉదయం చావుతప్పదు' అంటూ.

'అనుచితమైన కోరిక అని నిర్ణయించే అధికారం మీ రాజుకు లేదు. కేవలం నాతో పోరాడితే నీ ప్రాణాలు ఎక్కడ పోతాయోననే భయంతో నువ్వే అలా చెప్పించి వుంటావు. నీలాంటి పిరికిపంద సర్వసైన్యాధిపతి ఎలా అయ్యాడో నాకు అర్ధంకావటంలేదు' కూల్ గా, చాలా తాపీగా తన నిర్ణయాన్ని అతనికి వినిపించాడు ముఖేష్

సిగ్గుతో అవమానంతో నల్లగా కమిలిపోయిన ముఖాన్ని చటుక్కున ప్రక్కకు తిప్పుకొని అవతలికి వెళ్ళిపోతున్న సర్వ సైన్యాధిపతి వంక ఆశ్చర్యంగా చూశాడు నిశంభుడు.

'నిజంగానే మా సైన్యాధిపతి పిరికివాడా?' తన కనుల్ని తనే నమ్మలేక ముఖేష్ ని అడిగాడు.

'పిరికివాడు కాకపోతే ధైర్యస్థుడు ఎలా అవుతాడు? మాయమై పోయిన రాజకుమారిని, రాజనర్తకిని ఏదో ఒక విధంగా రక్షించి తీసుకురావాల్సిన మనిషి ఇతను. అవసరం అయితే రణదుర్గం మీద యుద్ధం ప్రకటించి ఆ వెధవల్ని నిలువునా నరకవల్సిన వ్యక్తి. ఆ పనులు చేయకుండా, ఆపదలో చిక్కుపడిన ఆ అమాయకురాళ్ళను వారి ఖర్మానికి వారిని వదిలేసి, ఎందుకూ పనికిరాని ఒక బంగారు నగను దొంగిలింప చూశానని నా మీద కత్తులు నూరుతున్నాడు. ఇతనేకాదు, మీ రాజు, మీ పౌరులు అందరూ చేతకానివాళ్ళే. చచ్చుదద్దమ్మలు. మాట మాటలోను అసహ్యం ప్రతిధ్వనిస్తుండగా అన్నాడు ముఖేష్ .

'రణదుర్గాధిపతి అగర్వుడి మీద యుద్ధం ప్రకటించటమంటే కొరివితో తల గోక్కోవటం వంటిది. అతని మీద బలప్రయోగం చేసిన వాళ్ళు సర్వనాశనం అయిపోతారనే మాట ఒకటి వుంది కాబట్టి ఆగారువాళ్ళు. యుద్ధం చేసేందుకు తగిన ధైర్యం లేకకాదు' తన రాజును, తన పౌరుల్ని అతను వెక్కిరించేసరికి భరించలేక వెంటనే అన్నాడు భూపతి.

'ఎందుకు నాశనం అవుతారట? వాడిదగ్గర మంత్రతంత్రాలు ఏవైనా ఉన్నాయా?' ఇంకా కాస్త వెక్కిరింపుగా అన్నాడు ముఖేష్.

'సరిగ్గా చెప్పావు. అగర్వుడికి గంధాక పర్వతాలమీద కాపురంచేసే మంత్రాల మరిడయ్యతో స్నేహం వున్నది. మంత్రాల మరిడయ్యకు కోపం వస్తే అగ్నివర్షం కురిపిస్తాడు. పిశాచాలను ప్రజలమీదికి పంపకం చేస్తాడు.'

మరేదో మాటను అనబోతూ ఠక్కున నోటిని మూసుకున్నాడు ముఖేష్. ఉన్నట్లుండి కథ ఇంకో మలుపు తిరిగిందని గ్రహించటానికి అతనికి ఎంతో సమయం అవసరం లేకపోయింది.

మాయమైపోయిన రాజకుమార్తె, నళినీదేవిలను గురించిన బాధకంటె, రాణీగారి పతకం మాయమైపోయిందనే భయమే చిత్రదుర్గ వాసులకు చాలా ఎక్కువగా వున్నదేమోనని వెంటనే అనిపించింది.

'రాణీగారి మెడలో నుంచి నేను అపహరించటానికి ప్రయత్నించిన పతకానికీ ఈ మంత్రాల మరిడయ్యకు ఏదైనా సంబంధం వున్నదా?" నిశంభుడివైపు చూస్తూ అడిగాడు.

వెంటనే తల ఎత్తాడు నిశంభుడు.

'ఆ పతకం రాణీగారి మెడలో వున్నంతవరకూ మరిడయ్య ప్రయోగించే మంత్రాలు రాజుగారి కుటుంబాన్ని ఏమీ చేయలేవు. అదే గనుక లేకపోయినట్లయితే, అతను మా రాజ కుటుంబాన్ని ఈ పాటికి ఎప్పుడో తన మంత్రాలకు ఆహుతి చేసేవాడు' అన్నాడు భూపతి.

'అటువంటి పతకమే నళినీదేవి మెడలో కూడా వున్నది కదా! ఆమెను మరి అగర్వుడు ఎలా బంధించి తీసుకుపోగలిగాడు?' అడిగాడు ముఖేష్.

'మంత్రాలకు సంబంధించిన ప్రమాదాలను మాత్రమే ఆ పతకాలు ఎదుర్కొంటాయి. మానవశక్తిని అడ్డుకోలేవని వాటిని తయారుచేసి ఇచ్చిన కాళికాలయ పూజారి అమరేశ్వరుడు చెప్పాడు అమరేశ్వరుడు నళినీదేవి తండ్రి. మంత్రాల మరిడయ్యను ఎదుర్కొనే శక్తుల్ని సంపాదించటం కోసం అడవుల్లో తిరుగుతున్నాడు. అతనికి ఆ శక్తులు సిద్ధించే వరకూ మా రాజ్యానికి ఈ అగర్వుడి బాధలు తప్పవు. భరించి వూరుకోవటం కంటె మరో మార్గం లేదు.'

అంతవరకూ ఎంతో క్లియర్ గా వున్న తన ఆలోచనలన్నీ ఒక్కసారిగా కలగాపులగం అయినట్లు అనిపించి తల రెండు చేతులతోనూ పట్టుకున్నాడు ముఖేష్.

అతని ఆలోచనల్ని గమనించి మాట్లాడించే ప్రయత్నం చేయలేదు భూపతి. మౌనంగా వుండమని నిశంభుడికి సైగచేసి తన నులకమంచం దగ్గిరికి వెళ్ళిపోయాడు.

కలగాపులగం అయిన ఆలోచనల్ని సరైనదారిలో పెట్టుకునే ప్రయత్నం చేయలేదు ముఖేష్. షాడో రాకకోసం ఎదురుచూస్తూ తను కూడా తన మంచం వైపు అడుగులు వేశాడు.

* * *

ఎక్కడా ఆగకుండా అశ్వాలను నడిపించి చీకటిపడే సమయానికి ఒక పర్వత పంక్తిని సమీపించాడు షాడో.

ఎక్కడైనా ఆగి కాస్తంత విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందన్న కోరికను ఎంతో బలవంతంగా బిగపట్టుకుంటోంది నళినీదేవి రణదుర్గం దగ్గర్నించి బయలుదేరిన అర్ధఘడియకల్లా తెలివివచ్చిన రాజకుమారి కూడా అలాగే అనుకుంటుంది కానీ, షాడోని మాట్లాడించే ధైర్యంలేక మౌనంగా వుండిపోయింది తను కూడా.

వారి అభిప్రాయాలను మన్నించటం కోసం ఆగలేదు షాడో మరొక్క అడుగుకూడా వేయలేనంతగా అలిసిపోయిన అశ్వాల పరిస్థితి గమనించి ఒక నీటిగుంట దగ్గిర అశ్వాలను నిలుపు చేశాడు.

బ్రతుకుజీవుడా అనుకుంటూ నేలమీదికి దూకి, దగ్గిర్లోవున్న ఒక చెట్టు క్రిందికి పోయారు రాజకుమారి, నళినీదేవి ఇద్దరూ.

'అతను ప్రయోగించిన అస్త్రం పేరేమిటి?' అంతకు ముందు ఒకసారి నళినీదేవి నోటివెంట వినివున్నా, మరోసారి అడిగింది రాజకుమారి రంజని.

'మనం ఎక్కడా వినివుండని పేరు లిటిల్ టామీట' అన్నది నళినీదేవి.

'అత్యద్భుతమైన ధైర్యసాహసాలు, అమోఘమైన అస్త్రశస్త్రాలు కలిగివున్న ఇతను మన దగ్గిర ద్వారపాలకుడిగా చేరటంలో ఆంతర్యమేమిటో!' రణదుర్గంలో షాడోని చూసిన క్షణం నుంచీ తన మనుసును తొలుస్తున్న సందేహాన్ని బయటపెట్టింది రాజకుమారి.

'అతన్నే అడిగి తెలుసుకోవాలి. మనంతట మనం కనిపెట్టలేము' అంటూ అశ్వంకు నీరుపెట్టి షాడో అటుగా రావడంతో మాటల్ని మానేసింది నళినీదేవి.

వారికోసం చిత్రదుర్గం నుంచి బయలుదేరే సమయం లోనే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకున్నాడు షాడో. వారి కోసం ఆహారపదార్థాలను కూడా తీసుకువచ్చాడు.

ఎండిపోయి మింగుడు పడటానికి అనువుగా లేనట్లు అగుపించే రొట్టెలు నాలుగింటిని వారికి అందించి, తను కూడా రెండు రొట్టెల్ని తిన్నాడు.

'నిన్ను ఒక విషయం అడగాలని వుంది అడగనా?' ధైర్యంచేసి రాజకుమారి సందేహాన్ని తీర్చేందుకు రెడీ అయింది నళినీదేవి.

పూర్తిగా కాకపోయినా కొంతవరకూ వారి సంభాషణ షాడో చెవుల్లో పడివుండటం వల్ల అంతగా ఆశ్చర్యపడలేదతను.

'అమోఘమైన శక్తులు కలిగివున్న నేను మీ దగ్గిర ద్వారపాలకుడిగా ఎందుకు చేరానంటే అందుకు పెద్ద కారణం వుంది.

అది మిమ్మల్ని మీ రాజ్యానికి చేర్చిన తర్వాత తెలుస్తుంది. అంతవరకూ అనవసరమైన ప్రశ్నలతో నన్ను విసిగించకుండా నా అనుమానం ఒకదాన్ని నివృత్తి చేయండి' అంటూ వారిముందు మట్టిలో కొన్ని గీతలు గీశాడు.

రణదుర్గం నుంచి చిత్రదుర్గం పోయేందుకు వారు అనుసరించాల్సిన మార్గం ఆ గీతల్లో ప్రస్ఫుటమవుతున్నది.

'ఈ మార్గం ద్వారా ప్రయాణం చేస్తే మనం చిత్రదుర్గం చేరటానికి ఇంకో రోజు పడుతుంది. మనం రేపు ఉదయానికల్లా రాజధానిలో వుండాలి. అందుకు అడ్డదోవలు ఏమైనా వున్నాయేమో మీకు తెలుసా?' వారిద్దరి ముఖాల్లోకి చూస్తూ అడిగాడు.

'గంధక పర్వతాల ప్రక్కనుంచి పోతే తెల్లవారక ముందే మనం రాజధానికి చేరుకోగలం' అంటూ షాడో అనుసరించవలసిన దిశను చూపిస్తూ చెప్పింది నళినీదేవి. 'కానీ గంధక పర్వతాల్లో వుండే మంత్రాల మరిడయ్య మన వునికిని పసికడితే మరిన్ని చిక్కులు ఎదురౌతాయి. ప్రాణాలతో రాజధానికి చేరుకోలేము' తన మెడలోని పతకాన్ని సవరించుకుంటూ భయం భయంగా చెప్పింది.

ఆ పతకం మీది కాళికాదేవి బొమ్మ తనవంక చూసి నవ్వినట్లుగా అనిపించి విసుగ్గా తల విదిలించాడు షాడో.

ఆ పతకాన్ని గురించి, దానిమీది బొమ్మను గురించి ఎంక్వయిరీలు చేసే సమయం అదికాదు. ముందు ముఖేష్ ని కలుసుకోవాలి. అందుకు అవసరమైతే ఆ మంత్రాల మరిడయ్య ఎవరో తమ దారికి అడ్డుపడినా ఆగకూడదు.

నళినీదేవి వదనంలో ప్రత్యక్షం అయిన బెదురును చూసి ఆగిపోవాలని అనిపించినా, ముఖేష్ ఆలోచనల మూలకంగా గంధక పర్వతాల ప్రక్కనుంచే ప్రయాణం చేయటానికి నిశ్చయించుకున్నాడు షాడో. మరో అర్ధఘుడియపాటు అశ్వాలకు విశ్రాంతినిచ్చి ప్రయాణానికి సిద్ధంచేశాడు.

తమకు ఎంత భయంగా వున్నా, అతనికి ఎదురు చెప్పలేక మౌనంగా అశ్వాలను అధిరోహించి అతని వెనుకే అడుగులు వేయించారు రాజకుమారి, నళినీదేవి ఇద్దరూ.

దారి అలవాటు అయ్యేదాకా నెమ్మదిగా అడుగులు వేయించి ఒక్కసారిగా తన అశ్వాన్ని పరుగుతీయించాడు షాడో. అర్ధగడియ తరువాత గంధక పర్వతాల ప్రక్కకుపోయి సూటిగా ముందుకు సాగాడు.

రాత్రి తొలి ఝాము గడుస్తున్న సమయంలో నళినీదేవి భయపడినంతా జరుగనే జరిగింది.

'తెలిసిపోయింది. మన రాక మంత్రాల మరిడయ్యకు అర్థమై పోయింది.' అని అంటూ తన అశ్వాన్ని వెనక్కి తిప్పే ప్రయత్నం చేసిందామె.

చటుక్కున చేతిని చాచి, కళ్ళేలను పట్టుకున్నాడు షాడో. ఆమె వెనక్కి పారిపోకుండా అడ్డుకుంటూ ముందుకు చూశాడు.

తలల మీద పెద్ద పెద్ద బొగ్గు కుంపట్లను పెట్టుకొని, తెల్లటి ఎముకుల్ని చేతుల్లో పట్టుకుని గంధకపర్వతాల ప్రక్కనేవున్న బాటకు అడ్డుగా నిలుచుని వున్నాయి పాతిక పిశాచులు.

వికృతంగా అరుస్తూ, ఎగిరెగిరి దూకుతూ ముందుకు వస్తున్నాయి.

'అవి మనల్ని విరుచుకుతింటాయి. కత్తులు, బరిశెలు, ఆఖరికి యుద్ధబాణాలు కూడా వాటిని ఏమీ చేయలేవు' భయంతో బెంబేలెత్తిపోతూ అన్నది నళినీదేవి.

అదే మరెప్పుడయినా అటువంటి దృశ్యం ఎదురై వుంటే, వట్టి చేతులతోనే ఆ పిశాచాలను ఎదుర్కొని, ఆమె మాటల్లో ఎంత యధార్ధం వుందో స్వయంగా తెలుసుకొని వుండేవాడు షాడో ఇప్పుడు అటువంటి పని చేయటానికి తగిన వ్యవధి లేకపోవటం వల్ల, రెండో ఆలోచన లేకుండా దుస్తులలో నుంచి తన రివాల్వర్ ని బయటికి తీశాడు.

'గుర్రాలు భయపడి పారిపోకుండా గట్టిగా పట్టుకోండి. మీరు కూడా ఖంగారుపడకండి' అని వారిద్దరినీ హెచ్చరిస్తూ, ముందుకు వచ్చేస్తున్న పిశాచాలకేసి రివాల్వర్ బారెల్ ని తిప్పి ట్రిగ్గర్ ని ప్రెస్ చేశాడు.

ఉరుములు ఉరిమినట్లు దారుణమైన శబ్దం వినవచ్చింది.

ముందుకు వస్తున్న పిశాచాల్లో ఒక పెద్ద పిశాచం వెర్రిగా అరిచి వెల్లకిలా పడిపోయింది.

భీకరమైన ఆ శబ్దానికి బెదిరి చిందులు తొక్కబోయిన తన గుర్రాన్ని నేర్పుగా నిలబెడుతూ మరో రెండుసార్లు ట్రిగ్గర్ ని నొక్కాడు షాడో. మరో రెండు పిశాచాలను పడగొట్టాడు.

ఆ పైన అదురుపుట్టింది కాబోలు వెనక్కి కూడా చూడకుండా గంధకపర్వతాల మీదికి పారిపోయాయి మిగిలిన పిశాచాలు.

ఆ దృశ్యాన్ని చూసి నివ్వెరబోతున్న నళినీదేవి వంక నవ్వుతూ చూశాడు షాడో.

'చనిపోయే సమయంలో పిశాచ రూపాల్ని వదిలి మానవులుగా మారిపోయాయి మీ మరిడయ్య పంపకం చేసిన గ్రహాలు. బాగా చూడు' అంటూ తన గుర్రాన్ని ముందుకు పోనిచ్చాడు.

అతని మాటల్లో అసత్యం ఏదీలేదు.

మామూలు మనుష్యులనే పిశాచాల వేషం వేసి, నెత్తిమీద కుంపట్లుపెట్టి వచ్చిపోయేవారిని బెదిరిస్తున్నాడు మరిడయ్య. వంటి మీద బలమైన ఇనుప కవచాలు ధరించి వుండటం వల్ల కత్తులు, బరిశెలు, యుద్ధబాణాల భయం వారికి లేకుండాపోయింది.

రివాల్వర్ దెబ్బకు ప్రాణాలు కోల్పోయిన ఆ పిశాచ స్వరూపాల్ని చూసి, 'ఇంతవరకూ ఎవరూ తెలుసుకోలేని ఈ రహస్యం నీకెలా తెలిసింది?' అని అడిగింది నళినీదేవి.

ఆ మాటకు సమాధానం ఇవ్వకుండా, అశ్వాల్ని ముందుకు నడిపించబోయిన షాడోని ఇంకో ప్రశ్న వేసింది అంతవరకూ మౌనంగా వున్న రాజకుమారి.

'రణదుర్గంలో నువ్వు శత్రువుల మీద ప్రయోగించిన అస్త్రాన్ని గురించి నాకు నళిని చెప్పింది. ఇప్పుడు ప్రయోగించిన అస్త్రం పేరేమిటి?'

రివాల్వర్ అనే మాటను వారికి అర్ధమయ్యేటట్లు చెప్పటం ఎలాగో షాడోకి తెలియలేదు.

'ఇది అస్త్రం కాదు ఆయుధం. పొడుగాటి ఈ గొట్టంలోనుంచి అగ్నిగోళం ఒకటి బయటికి వచ్చి ఎదుటవున్న ఎంతటి శక్తివంతుడినైనా సరే చిటికెలో హతమార్చివేస్తుంది.' అన్నాడు.

'అంటే దీనిపేరు గొట్టపు ఆయుధమా?' అడిగింది రాజకుమారి.

గొట్టమనే మాట ఎబ్బెట్టుగా వినిపించటంవల్ల వెంటనే మరో పేరు చెప్పాడు షాడో.

'గొట్టం కాదు నాళిక. ఇది నాళికాయుధం. బహు ప్రమాద వంతమైనది' అంటూ చేతిలోని రివాల్వర్ ని దుస్తుల్లో దాచేసాడు.

దారికి అడ్డువచ్చిన అవరోధం అడ్డు తొలగగానే తిరిగి వేగంగా సాగింది వారి ప్రయాణం. ఆఖరి ఝాము ఇంకో కొద్దిసేపటిలో అంతమై వెలుగు వస్తుందనగా వారి ఎదుట ప్రత్యక్షం అయింది చిత్రదుర్గం.

* * *

తూర్పుదిక్కు తెల్లబడటం - మాయమైపోయిన రాజకుమారి, రాజనర్తకి నళినీదేవిని రక్షించటం జరిగిందన్న వార్త వీధుల్లోకి రావటం ఒకేసారి జరిగింది.

ఉరిశిక్ష అమలు జరిగేందుకు ఇంకా వ్యవధి వున్నా, అప్పటికప్పుడు రాజభవనం ముందు గుమిగూడటం మొదలు పెట్టారు చిత్రదుర్గ ప్రజలు.

ఆ కలకలాన్ని శాంతింపచేయటం సైనికులకు అసాధ్యమై పోయింది.

అలవాటుకు విరుద్ధంగా అప్పటికప్పుడు కొలువుకూటానికి వచ్చాడు వీరసేనుడు. మంత్రి సామంత, దండనాయకులందరూ

కొలుస్తుండగా సింహాసనం మీద కూర్చుని, కొత్తగా ఏర్పడిన పరిణామాలను సమీక్షించటం మొదలుపెట్టాడు.

అంతకు ముందురోజు ముఖేష్ కోరిన ఆఖరి కోరికను నిరాకరించే ఆలోచన చెప్పి, అత్యద్భుతంగా వాదించిన మంత్రి కుమారుడు జయపాలుడు షాడోని కూడా ఉరికంబం ఎక్కించే విధానం కోసం ఆలోచిస్తూ తన ఆసనం మీద అసహనంగా అటూ ఇటూ కదులు తున్నాడు.

'రాజకుమారిని, రాజనర్తకి నళినీదేవిని మేమే అపహరించామని మా పరోక్షంలో నిందవేసి నా తల తెచ్చిన వారికి బహుమతి ప్రకటించిన మాట యధార్థమేనా?' రాజసభ మధ్యలో నిలబడి నిర్భయంగా, జంకుగొంకు లేని కంఠంతో రాజుగారిని అడిగాడు షాడో.

అంతకుముందు వరకూ తలవంచి వినయాతి వినయంగా నిలబడిన అతను ఉన్నట్లుండి అంత ఠీవిగా, అంత కటువుగా మాట్లాడటం మొదలుపెట్టేసరికి సభ మొత్తం నివ్వెరబోయింది.

'సభామర్యాద పాటించటం తెలియని ఇతన్ని వెంటనే బంధించాలి' చివ్వున లేచి కోపంగా అన్నాడు యువరాజు శ్రీసేనుడు.

సహనం అంతరించిపోయింది షాడోకి. ఛెంగున ప్రక్కకు దూకి అతని దుస్తుల్ని వడిసిపట్టుకోవాలనే ఆలోచన అతని మనసులో ప్రవేశించటం నళినీదేవి గమనించింది.

చటుక్కున తన ఆసనం మీదినించి లేచి అందరినీ నిశ్శబ్దంగా వుండమని చేతులు జోడించిందామె.

రాజుగారి అనుమతిని పొంది రణదుర్గంలోను, గంధక పర్వతాల దగ్గిరా జరిగినదంతా సవివరంగా అందరికీ తెలియచేసింది.

రాజకుమారి రంజని ద్వారా ఆ కథనంతా అంతకుముందే విని వుండటం వల్ల, ఆమె మాటలు ముగిసిన మరుక్షణం తన వాదనను ప్రారంభించాడు మంత్రి కుమారుడు జయపాలుడు.

'ఇతను మంత్రాల మరిడయ్య సహచరుడు అయివుండాలి. అతని సహచరుడు కాకపోతే ఎవరికీ తెలియని ఆ పిశాచాల రహస్యం ఇతనికి ఒక్కడికే ఎలా తెలుస్తుంది? మనల్ని నమ్మించి, మనకు రక్షణగా అమరేశ్వరుడు ఇచ్చిన పతకాలను అపహరించటమే ఇతని ఉద్దేశ్యం' నిర్మొహమాటంగా, నిర్భయంగా తన అభిప్రాయాన్ని తెలియచేశాడు.

మంత్రాల మరిడయ్య ప్రసక్తి వచ్చేసరికి ఆవేశపూరితులైనారు సభాసదులు.

'చంపండి. మరిడయ్య అనుచరులు ప్రాణాలతో వుండకూడదు. ముక్కలు ముక్కలుగా నరికి ఉప్పుపాతర వేయండి' అని అరవటం మొదలుపెట్టారు.

రాజుగారి ఆజ్ఞ చెవులపడిన మరుక్షణం ముందుకు దూకటానికి సిద్ధంగా నిలబడిన సైనికుల్ని చూసేసరికి చీమలు పాకినట్లు అయింది

షాడో శరీరం మీద. రివాల్వర్ మీదికి పోబోతున్న చేతిని ఎంతో ప్రయత్నం మీద ఆపుకుని తీవ్రంగా ఆలోచించటం మొదలు పెట్టాడు.

ఏంచేసినా, ఎలా చేసినా, కథ మొత్తం అడ్డం తిరిగే సూచనలు తప్ప సుఖాంతం అయ్యే లక్షణాలు ఒక్కటి కూడా కనిపించటం లేదు.

తన ఆయుధాల్ని తీసినా, వట్టిచేతులతో బలప్రయోగం జరిపినా తమమీది నేరం మరింత బలపడేటట్లుంది గాని, తొలగిపోయే మార్గం గోచరించటంలేదు. తను, ముఖేష్ అక్కడినుంచి అవలీలగా అవతలికి పోగలరు. న్యాయాన్ని, ధర్మాన్ని గౌరవించే భూపతి నిశంభుడు నిర్దోషులని నిరూపించబడటం ఎలా?

ఎలాగో అతనికి అర్ధం కాకముందే మరోసారి తన అభిప్రాయాన్ని అందరికీ తెలియచేశాడు మంత్రి కుమారుడు.

'ముందుగానే ఆలోచించి ఒక పథకం ప్రకారం నడిపింపబడిన నాటకం ఇది. తన జతగాడు మన చేతుల్లో బందీ అయినట్లు తెలిసి, మన రాజకుమారిని, నళినీదేవిని రణదుర్గం నుంచి వెనక్కు తీసుకువచ్చాడు ఈ నీచుడు. తన జతగాడు మహారాణి మెడలోని పతకాన్ని అపహరించటంలో కృతకృత్యుడు అయివుంటే తీసుకు వచ్చేవాడు కాదు' షాడో మనసులోని ఆలోచనలన్నీ తనకు అవగతం అయినట్లు ఎంతో హుందాగా, గంభీరంగా అన్నాడతను.

'ఇటువంటి దారుణమైన వంచన చేయగల ఈ మోసగాడికి కూడా ఉరిశిక్ష విధించటమే సమంజసం. ప్రభువుల వారు వెంటనే అందుకు తగిన ఆజ్ఞలను జారీ చెయ్యాలని నా కోరిక' అంటూ తన వాదనను ముగించాడు.

'మహారాణిగారి మెడలోని పతకాన్ని అపహరించటమే మా ధ్యేయం అయితే మరి నళినీదేవి మెడలోని పతకాన్ని ఆమె దగ్గిరే వుండనీయటం ఎలా సంభవించింది? ఆ పతకాన్ని అపహరించకుండా ఊరుకోవటం ఎలా కుదిరింది?' ఉన్నట్లుండి అడిగాడు షాడో.

సభాసదుల చూపులన్నీ ఒక్కసారిగా నళినీదేవి వైపు తిరిగాయి. మహారాజు, మహామంత్రి మొదలైన వారు కూడా ఆమె మెడకేసి చూశారు.

'ఈ పరదేశి చెప్పింది అక్షరాల నిజం. రణదుర్గంలో మాకు ఇతని వల్ల ఇసుమంత కూడా అపకారం జరుగలేదు. ఇతని దయవల్ల మేము అవమానింపబడకుండా బయటపడగలిగాంగాని, ఇతనే కనుక సమయానికి రాకుండా వున్నట్లయితే మా జీవితాలు అక్కడ సర్వనాశనం అయివుండేవి. ఇతను నా మెడలోని పతకాన్ని గురించి ఒక్క మాటకూడా మాట్లాడలేదు' వెంటనే లేచి నిలబడి తన అభిప్రాయాన్ని వారికి వివరించింది నళినీదేవి.

'ఈ మాటలు ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు?' వెనువెంటనే కటువుగా అడిగాడు మహామంత్రి.

'ఈ పరదేశి దయాధర్మ భిక్షల మూలకంగా రాజకుమారి, నేను ప్రాణాలతో రణదుర్గం నుంచి బయటపడటం జరిగిందని మొదటినుంచీ చెపుతున్నాను. అయినా తన అసమాన వాదానా చాతుర్యంతో ఆ మాటల్ని మరుగున పరిచి, ఈ పరదేశిని దోషిగా నిరూపించదలుచుకున్న మంత్రి కుమారుడు జయపాలుడి ఆంతర్యం అందరికీ తెలియాలని ఆగాను. నిజానిజాలు ఏమిటో మంత్రివర్యులే నిర్ణయించండి. న్యాయ నిర్ణయంలో వ్యక్తిగతమైన కక్షలకు కార్పణ్యాలకు తావువుండకూడదు' సూటిగా చురకవేసింది నళినీదేవి.

అంతకుముందు మంత్రి కుమారుడు, యువరాజు శ్రీసేనుడు పరదేశుల చేతుల్లో పొందిన అవమానం గుర్తుకువచ్చి అవునవునని శ్లాఘించారు సభికులు.

జయపాలుడు తన కుమారుడనే మాటను మనుస్ఫూర్తిగా మరిచిపోయి తీవ్రాతితీవ్రంగా ఆలోచించాడు మహామంత్రి. ఎంత ఆలోచించినా, ఒక మాటను కాదని అనటంగాని, మరిచిపోవటం గాని , ఆయనకు చేతకాలేదు.

'పరదేశి మాటల్లో యదార్ధం వుందని మనం అంగీకరిద్దాం. రణదుర్గం నుండి అతను మన ఆడబడుచుల్ని పెద్ద ప్రమాదం నుండి

రక్షించి తీసుకువచ్చినందుకు అతన్ని గౌరవిద్దాం. కాని, అతని జతగాడు మహారాణి మెడలోని పతకాన్ని అపహరించజూడటం యధార్థం. దీన్ని అతను కాదనగలడా?' షాడోకేసి తిరుగుతూ అడిగాడు.

కాదని అనలేకపోయాడు షాడో.

'అందుకు శిక్ష అనుభవించి తీరాలి. అతనికి ఉరిశిక్ష అమలు జరగాలి.'

'అతనితోపాటు భూపతికి, నిశంభుడికి కూడా శిక్ష అమలు జరుగుతుందా?' అడిగాడు షాడో.

'ఖచ్చితంగా. రాజద్రోహికి ఆశ్రయం ఇచ్చినవారు కూడా ద్రోహులే.'

'నేను రాజద్రోహినా?'

'నువ్వు కాదు. నీ జతగాడు రాజద్రోహి.'

'నేను రాజద్రోహిని కాదు. రాజకుమారిని, రాజనర్తకిని క్షేమంగా ఇల్లు చేర్చిన అసమాన శౌర్యవంతుడిని. మీకందరకూ గౌరవనీయుడిని అవునా?'

'అవును. నిస్సంశయంగా నువ్వు గౌరవనీయుడివే. నిన్ను అపరాధిగా భావించి జయపాలుడు, యువరాజు శ్రీసేనుడు మాట్లాడిన మాటలకు మేము ఎంతగానో బాధపడుతున్నాం.'

షాడోకి కావాల్సిన ఓపెనింగ్ మరొకటి వెంటనే దొరికింది. అటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న అతను వెంటనే ఉపయోగించుకున్నాడు దాన్ని.

'మరి నావంటి గౌరవనీయుడిని, అసమాన బల ప్రతాపవంతుడిని మీకు, మీ రాజ్యపు పౌరులకు పరిచయం చేసిన నిశంభుడు, నా వంటి వాడికి ఆశ్రయం ఇచ్చిన భూపతి రాజద్రోహులు ఎలా అవుతారు? వారికి ఉరిశిక్షను ఎలా విధిస్తారు?'

మామూలు మాటలతో విడదీయటం సాధ్యపడని ఆ మెలికను వెంటనే గమనించి గాఢంగా నిట్టూర్చాడు మహామంత్రి.

అంతలోనే ఆసనం మీదినుంచి లేచాడు అంతవరకూ మౌనంగా కూర్చొని వున్న సర్వసైన్యాధిపతి.

'సూర్యోదయమై చాలాసేపయింది. శిక్ష అమలుజరపాల్సిన సమయం దాటిపోతుంది' అంటూ గుర్తుచేశాడతను మహారాజుకు నమస్కరిస్తూ.

మహారాజు తల ఊపడం అంటూ జరిగితే షాడో తన వద్దవున్న ఆయుధాలను, అస్త్రశస్త్రాలను బయటికి తీసి, తన జతగాడిని రక్షించుకోవటానికి బయలుదేరతాడని భయపడింది నళినీదేవి.

ఎదుటవున్న ఎంతమందినైనా చిటికెలో భస్మం చేయగల లిటిల్ టామీ ముందు, ఎటువంటి బలసంపన్నుడినయినా కనురెప్పపాటు

లో మట్టిపాలు చేయగల అతని నాళికాయుధం ముందు చిత్రదుర్గ వీరులు అసలు నిలబడగలరా?

తన ఆందోళనను అణుచుకొనే ప్రయత్నం చేయలేదామె. అలజడి నిండిన చూపులతో అంతఃపుర కాంతలు కూర్చున్న ప్రదేశం వైపు చూసింది.

ఆమె ఆంతర్యాన్ని గమనించి వెంటనే తన ఆసనం మీదినుంచి లేచి, మహారాజు అనుమతి తీసుకోకుండానే సభ ముందుకు వచ్చింది రాజకుమారి రంజని.

'ఈ దేశపు యువరాణిగా నాకున్న అసాధారణాధికారాన్ని ఉపయోగించి నా నిర్ణయాన్ని ప్రకటిస్తున్నాను. భూపతి, నిశంభులు నిర్దోషులు. మమ్మల్ని రక్షించిన ఈ పరదేశి, ఇతని జతగాడు వీరి నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు తగినంత గడువు ఇవ్వాలి అంతవరకూ వీరికి విడుదల ప్రసాదించాలి. వీరి ప్రవర్తనకు నేను నళినీదేవి పూటకాపులుగా వుంటాము. ఈ విషయం మీద ఇక చర్చలు అనవసరం' అంటూ తన అభిప్రాయాన్ని రాజుగారికి వినిపించింది.

తనకున్న అధికారాన్ని ఉపయోగించి ఆమె మాటల్ని ఖండించమని యువరాజును ప్రోత్సహించబోయాడు జయపాలుడు. కాని సరయిన మాటలు నోటికి అతనికి రాకపోవటంతో ఆగిపోయాడు.

పది నిముషాలు ఆలోచించి రాజకుమారి అభిప్రాయాన్ని తాము అంగీకరిస్తున్నట్లు ప్రకటించాడు మహారాజు. ఆ రోజుకు సభ చాలించాడు.

ముఖేష్ ని చిక్కుల్లోనించి తప్పించేందుకు యువరాణి చూపించిన చొరవకు మెచ్చుకుంటూ చేతిని ఎత్తి శాల్యూట్ చేశాడు షాడో.

'నమస్కారం చేయటానికి వాళ్ళు చేసే సైగకాబోలు అది. ఈ పరదేశీయుల ఆచార వ్యవహారాలు చాలా గమ్మత్తుగా వుంటాయి మాటలు చేతలు అన్నీ చిత్రవిచిత్రాలుగా కనిపిస్తాయి' తల్లి దగ్గిరకి పోయి రహస్యంగా అన్నది రాజకుమారి రంజని.

* * *

క్షేమంగా విడుదలై వచ్చినందుకు పండుగ చేసుకున్నారు భూపతి కుటుంబ సభ్యులు. తమ కుటుంబానికి ఆపాదించబడిన కళంకం సమసిపోయినందుకు ఎంతోగానో ఆనందించారు.

'మాకు కలిగిన కష్టాల్ని తలుచుకొని, అనవసరమైన మాటలతో నిన్ను తూలనాడాను. నన్ను మన్నించు' తండ్రి, నిశంభులతో పాటు ఇంటికి వచ్చిన ముఖేష్ తో అన్నది చంద్రిక.

'ఇట్సాల్ రైట్ బేబీ. నీ స్థానంలో ఎవరున్నా అలాగే ప్రవర్తిస్తారు. ఆ విషయాల్ని మరిచిపోదాం' అంటూ పెరటిలోకి పోయి పూలచెట్ల క్రిందవున్న తమ బీపర్ మెషీన్ ని తీసి దుస్తుల్లో దాచుకున్నాడతను.

భూపతి భార్య పెట్టిన రొట్టెల్ని తిని మంచంమీద పడుకున్నాడు షాడో. రణదుర్గం నుంచి వచ్చిన అలుపు తీరేదాకా నిద్రపోవాలని అతని ఉద్దేశ్యం.

అందుకు అవకాశం ఇవ్వలేదు ముఖేష్. జైల్లో వుండగా నళినీదేవి తండ్రి అమరేశ్వరుడి గురించి, మంత్రాల మరిడయ్యను గురించి అతనికి వివరంగా చెప్పాడు.

'మహారాణి మెడలోని పతకం, నళినీదేవి దగ్గరవున్న పతకం ఈ రెంటినీ అమరేశ్వరుడే తయారుచేసి మరిడయ్య ప్రయోగించే మంత్రాలకు విరుగుడుగా వీరికి ఇచ్చాడట. మనం వెంటనే అతన్ని వెతికి పట్టుకోవాలి. మనం వచ్చిన పని సజావుగా నెరవేరాలంటే అతన్ని క్వశ్చన్ చేసి తీరాలి' అంటూ తన అభిప్రాయాన్ని వివరించాడు.

నిద్రపోయే ఆలోచనను విరమించుకొని మంచం దిగాడు షాడో. చిత్రదుర్గపు పౌరులు ధరించే దుస్తుల్ని వదిలేసి తమ పాత దుస్తుల్ని ధరించారు వారిద్దరూ. ఆయుధాల్ని సరిచూసుకున్నారు. భూపతి కుటుంబం పండుగ చేసుకోవటంలో బిజీగా వున్న అదనులో, ఎవరికీ కనిపించకుండా వీధిలోకి వచ్చేశారు. సందుగొందుల్లో అడుగులు వేస్తూ దుర్గం బయటవుండే మైదానంలోకి అడుగుపెడుతుండగా అక్కడ వున్న ఒకే ఒక పెద్ద మర్రిచెట్టు చాటునుంచి వారి ఎదుట ప్రత్యక్షం అయింది నళినీదేవి.

'అయ్యబాబోయ్ నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావ్? మళ్ళీ ఆ అగర్వుడు చూస్తే నిన్ను వదిలిపెడతాడా?' ఆందోళనగా అడగబోయిన ముఖేష్‌ని చూసి చిన్నగా నవ్వింది ఆమె.

మీ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవటానికి మా తండ్రిగారి సహాయం అవసరం అవుతుందని నాకు తెలుసు. ఏదో ఒక సమయంలో మీరు నగరం వదిలి ఇటుగా వస్తారని ఇక్కడే కూర్చుని ఎదురుచూస్తున్నాను. మీతోపాటు నేను కూడా వస్తున్నాను' నడుము మీద చేతులు వేసుకుంటూ చెప్పిందామె.

'కాలు కిందపెడితే కందిపోయే సుకుమారివి నువ్వు మాతోపాటు అడవుల్లో తిరగలేవు. హాయిగా వెనక్కి వెళ్ళిపో. మీ తండ్రిగారు కనిపిస్తే మాతోపాటు నగరంలోకి తీసుకువస్తాము' అన్నాడు ముఖేష్.

'కందిపోయినా, కష్టాలు ఎదురయినా నా నిర్ణయంలో మార్పు వుండదు. మీతోపాటు వచ్చి తీరతాను. నా నిర్ణయానికి తిరుగులేదు' అంటూ మొండిగా చెప్పి అలాగే నిలబడిందామె.

చిరాకుగా ముఖంపెట్టి షాడోకేసి చూశాడు ముఖేష్.

నళినీదేవి మాటలకు అభ్యంతరం చెప్పలేదు షాడో. ఆమె రావటం, రాకపోవటంతో తనకేమీ సంబంధంలేనట్లు ముందుకు అడుగువేశాడు.

'మాతోపాటు వస్తే మేము చెప్పినట్లు వినాలి. నీ స్వంత నిర్ణయాలు మా దగ్గిర పనికిరావు' అతని వెనుకే బయలుదేరుతూ నళినీదేవిని హెచ్చరించాడు ముఖేష్.

అందుకు తల ఊపి వారిని అనుసరించింది నళినీదేవి. చీకటి పడేదాకా ప్రయాణం చేశారు వాళ్ళు. చీకటి పడే సమయంలో వారి ఎదుట ప్రత్యక్షం అయిందొక దట్టమైన అడవి.

* * *

మహత్తరమైన శక్తులు సంపాదించటం కోసం చెట్లు పుట్టలు పట్టుకు తిరిగే మనిషిని పట్టుకోవటం అనుకున్నంత తేలికకాదని ప్రయాణం ప్రారంభించిన రెండోరోజు ఉదయానికల్లా ముఖేష్ కి అర్ధమైపోయింది.

అతను పురాణ గాథల్లో చదువుకున్న మహర్షుల మాదిరిగా, సిద్ధసాధ్యుల మాదిరిగా ఏదో ఒకచోట స్థిరనివాసం ఏర్పరచుకోలేదు నళినీదేవి తండ్రి.

అడుగుపెట్టటానికి వీలుకానంత దట్టంగా వున్న ఆ అడవిలో అనుకున్నంత వేగంగా కొనసాగలేదు వారి ప్రయాణం.

'ఇలా అయితే మనం ముసలివాళ్ళం అయిపోయేదాకా ఈ కాలంలోనే వుండిపోతాం. ఈ జన్మలో మన ఇళ్ళకు పోలేము' నడిచి నడిచి అలుపువచ్చేసరికి ఒక చెట్టుక్రింద చతికిలపడుతూ షాడోతో అన్నాడు అతను.

'ఈ కాలంలోనే వుండిపోవటం ఏమిటి? మీ ఇళ్ళు ఏ దేశంలో వున్నాయి?' కుతూహలంగా అడిగింది నళినీదేవి.

'ఆ కథ చెప్పాలంటే మనకున్న వ్యవధి చాలదు బేబీ. మరెప్పుడయినా అడిగితే గుర్తుచేసుకుని చెపుతాను' కటికనేలమీద మేనువాలుస్తూ అన్నాడు ముఖేష్ .

'బేబీ అంటే అర్థం ఏమిటి?' ఊరుకోలేక మరో ప్రశ్న వేసింది నళినీదేవి.

'బేబీ అంటే బేబీనే ... సుందరీ అని... జవరాలా అని ... మదవతీ అని రకరకాల అర్థాలున్నాయి' అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు ముఖేష్ .

సిగ్గుతో కెంపులా ఎర్రబడిన ముఖాన్ని చేతుల్లో దాచుకొని, ఆ చెట్టుక్రిందినుంచి అవతలికి పారిపోయింది నళినీదేవి. అక్కడికి వంద గజాల దూరంలో వున్న ఇంకో చెట్టు క్రిందికి పోతుండగా ఆమె చెవుల చేరింది ఒక సన్నని కంఠం.

రెండు క్షణాలపాటు తదేకంగా విని వెంటనే వెనుతిరిగిందామె. పరుగు పరుగున ముఖేష్ దగ్గిరికి వచ్చి ఆ విషయాన్ని వెల్లడించింది.

ఒక్క ఉదుటున పైకి లేచి ఆమె చూపించిన ప్రదేశంలోకి పోయాడు ముఖేష్ . చెవులు రిక్కించి విన్నాడు.

నళినీదేవి మాటల్లో అసత్యం ఏమీలేదు. ఎక్కడినుంచో వినవస్తున్నది ఎవరో హృదయవిదారకంగా రోదిస్తున్న సవ్వడి.

'మంత్రాలు, మాయలతో నిండివుండే అరణ్యం ఇది. మనల్ని ఆకర్షించి మోసం చేయటానికి ఏ పిశాచమో అలా రోదిస్తున్నట్లు నటిస్తుంది. ముందుకు వెళ్ళటం మంచిది కాదేమో!' అటుకేసి కదలబోయిన షాడోని చూపులతోనే వారిస్తూ అనుమానంగా అన్నది నళినీదేవి.

'ఈ దరిద్రపుగొట్టు అడవిలో అడుగుపెట్టిన దగ్గిర్నించి మనలో మనం మాట్లాడుకోవటం తప్ప మరో ప్రాణితో మాట్లాడింది లేదు పిశాచమైనా, రాక్షసి అయినా వెళ్ళి పలకరించాల్సిందే పదండి' అంటూ ముఖేష్ ముందుకు అడుగువేయటంతో ఆపైన మాట్లాడలేక పోయిందామె.

అడ్డువచ్చిన ముళ్ళపొదల మధ్యలోనుంచి అతి జాగ్రత్తగా అడుగులు వేస్తూ ముందుకుపోయి అర్ధఘడియ తరువాత ఒక ఖాళీ ప్రదేశాన్ని చేరుకున్నారు వాళ్ళు.

వరుసలో కట్టివున్నాయక్కడ పాతిక పూరిళ్ళు. అడవిలో దొరికే మూలికల్ని, అడవి వస్తువుల్ని సేకరించి పట్టణాల్లో అమ్ముకుని బ్రతికే కోయలగుంపు ఒకటి ఆ ప్రదేశంలో నివశిస్తుంది.

చిన్నల నుంచి పెద్దలదాకా తమ గుడిశెల ముందున్న పెద్ద మర్రిచెట్టు దగ్గిర పోగయివున్నారు ఆ కోయలు.

చెట్టు క్రింద ప్రతిష్టించబడివున్న పెద్ద దేవతా విగ్రహం ముందు కూర్చుని పెద్ద కంఠంతో ఏడ్చి రాగాలు తీస్తోంది ఒక ఆడమనిషి.

గాలివాలున తమకు వినబడిన సన్నపాటి కంఠం ఆ మనిషిదే అని గ్రహించి అడుగులు తూచివేస్తూ ఆ చెట్టు దగ్గిరికి పోయాడు ముఖేష్.

'ఎవరమ్మా నువ్వు? ఎందుకంతలా రోదిస్తున్నావ్?' అని అడిగాడు.

మొట్టమొదటిసారిగా అతన్ని, షాడోని, వారివెంట వున్న ఆడమనిషిని చూసి ఆశ్చర్యపడ్డారు అక్కడ చేరివున్న కోయలు.

'మంత్రాల మరిడయ్య ఆగ్రహానికి ఆమె మొగుడు బలైపోయాడు వంటచెరకు కోసం అడవి మధ్యకు పోయిన ఆ బిడ్డ భర్తను మరిడయ్య అనుచరులు ఎత్తుకుపోయారు' విషాదం నిండిన కంఠంతో చెప్పాడు అందరిలోకి వృద్ధుడైన కోయ ఒకతను.

చిత్రదుర్గంలో వుండగా ఒకటికి నాలుగుసార్లు అదేపనిగా వినవచ్చే మరిడయ్య ప్రసక్తి ఆ కీకారణ్యంలో కూడా వినపడేసరికి ఆశ్చర్యంతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు షాడో, ముఖేష్ లు.

'ఈ మరిడయ్య ఎవరోగాని మన కాలంలోని హాజీమస్తాన్ మాదిరి చాలా నొటోరియస్ పర్సనాలటీ మాదిరి కనిపిస్తున్నాడు వీడి

వ్యవహారం ఏమిటో ముందుగా తేల్చుకుంటే బాగుంటుందని అనిపిస్తోంది' ప్రక్కనే వున్న నళినీదేవికి అర్ధంకాకుండా తమ భాషలో అన్నాడు ముఖేష్.

భాష అర్ధం కాకపోయినా హాజీమస్తాన్ పేరును అర్ధం చేసుకున్నది నళినీదేవి. అతనెవరని అడిగింది. ముఖేష్ సమాధానం చెప్పకపోవటంతో అతను కూడా మాంత్రికుడేనా అని ప్రశ్నించింది.

ముఖేష్ ముఖంలో ప్రత్యక్షం అవుతున్న విసుగును గమనించి నవ్వుకుంటూ చెట్టు క్రిందినుంచి ఇవతలికి వచ్చేశాడు షాడో. వంట చెరకు కోసం వెళ్ళి మాయమైపోయిన కోయ అనుసరించిన మార్గాన్ని తను కూడా అనుసరించటం మొదలు పెట్టాడు.

సూర్యుడు నడినెత్తిమీదికి వస్తుండగా వారి దారికి అడ్డువచ్చింది ఒక పెద్ద కొండవాగు. దారి వడ్డున కనిపించిన అడుగుజాడల్ని అనుసరించి ముందుకు పోయేసరికి సాయం సమయం అవుతున్న సమయంలో ఎదురైనాయి కొన్ని కొండగుట్టలు.

తల వంచుకొని ముందుకు పోబోతున్న షాడో చేయి పట్టుకుని వెంటనే ఆపేసింది నళినీదేవి. కనులతోనే ముందుకు చూపించింది.

కొండగుట్టల మధ్యభాగంలో నుంచి సన్నగా పైకి వస్తోంది నీలం రంగులో వున్న పొగ. అక్కడ ఎవరో కూర్చొని చిదుగుల మంట వేసుకుంటున్నట్లు కనిపిస్తోంది ఆ దృశ్యం.

మరికొంచెం ముందుకుపోయి ఒక బండరాయి చాటున వదిగి నిలబడ్డాడు షాడో. తమ వునికి బయట పడకుండా ముందుకు తొంగిచూశాడు.

కొండగుట్టల మధ్యన వున్నది ఒక ఖాళీ ప్రదేశం. అక్కడ కూర్చొని వున్నారు పాతికమంది ఆగంతకులు. వారి మధ్యలో భగభగ లాడుతోంది ఒక నెగడు.

'పట్టపగలు చలికాచుకోవడానికి ఆ మంటను వేయలేదు వీళ్ళు. అందుకు ఏదో కారణం వుండి వుంటుంది' ముఖేష్ చెవిదగ్గిర నోరు పెట్టి రహస్యంగా చెప్పింది నళినీదేవి.

ఆ మాట తనకు తెలుసని అనబోయి, అక్కడ వున్న వ్యక్తుల్లో చలనం రావటంతో ఆగిపోయాడు ముఖేష్.

'తీసుకురండి. సంధ్యాసమయం దగ్గిరికి వచ్చేసింది. సూర్యుడు అస్తమించిన వెంటనే పని ప్రారంభించాలి.' ఉన్నట్లుండి అన్నాడు నెగడుముందున్న వ్యక్తుల్లో ఒకతను.

అక్కడికి కొద్ది దూరంలో వున్న ఒక గుహ దగ్గిరికి పోయి, లోపల బంధించబడివున్న కోయనొకన్ని బయటికి తీసుకువచ్చారు ఇద్దరు వ్యక్తులు.

'అతనే మనం వెదుకుతున్న కోయ అతనే' ఆశ్చర్యాన్ని అణుచు కోలేక కాస్తంత గట్టిగా అన్నది నళినీదేవి.

అదిరిపడి ఆమె నోటిని అదిమాడు ముఖేష్. అప్పటికే ఆలస్యం అయిపోయింది.

'పరులెవ్వరో మన పంచకు వచ్చిన సవ్వడి అయింది. పట్టుకోండి వారిని. పారిపోనీయకండి' అంటూ గప్పున నెగడు ముందు నుంచి లేచి బండలకేసి పరిగెత్తుకువచ్చారు నలుగురు వ్యక్తులు.

నళినీదేవి చేయి పట్టుకొని ఇంకో బండచాటుకు జంప్ చేశాడు షాడో. ఆమెను క్రింద కూర్చోమని సైగచేసి, తనుకూడా ఒక ప్రక్కన వదిగి నిలబడ్డాడు.

ఒక్క అంగుళపు స్థలాన్ని కూడా వదిలిపెట్టకుండా ఆ చుట్టుపట్ల వున్న బండలచాటున వెతుకుతూ ముందుకు ముందుకు వస్తున్న నెగడు వ్యక్తుల్ని చూసి భయంతో వణికిపోయింది నళినీదేవి. తాము పట్టుబడిపోవటమో, వారితో భీకరమైన పోరాటం చేయటమో తప్పదని ఆమె అనుకుంటుండగా, వాళ్ళు దాగుకొని వున్న బండరాతికి అల్లంత దూరంలోనుంచి పెద్దగా వినవచ్చింది కొండల్లో తిరిగే అడవిమేక అరుపు.

తప్పిపోయింది కాబోలు దాని పిల్ల. దాన్ని వెతుకుతూ బండల్లో తచ్చట్లాడుతోంది అది. మధ్య మధ్యలో దీనంగా అరుస్తోంది.

అదాటుగా వింటే అచ్చు మనిషి కంఠం మాదిరిగా వినవచ్చే ఆ మేక అరుపును ఆలకించి ఒకరివంక ఒకరు చూసుకున్నారు నెగడు ముందునుంచి అటుగా పరిగెత్తుకు వచ్చిన వ్యక్తులు.

'అనవసరంగా కంగారుపడ్డాం. ఈ పాడుమేక మనల్ని మోసగించింది. ఈసారి ఎప్పుడయినా ఎదురయితే వేటాడి వేయించుకు తిందాం' తమలో తాము అనుకుంటూ వెనక్కి వెళ్ళిపోయారు.

'ఆ మేక మనకి కనిపిస్తే సాష్టాంగ నమస్కారం చేస్తాను. మన పాలిట అదృష్టదేవత అది' షాడో వంక చూస్తూ లో గొంతుకతో అన్నది నళినీదేవి.

'అయితే అందుకు సిద్ధంగా వుండు. ఇటే వస్తోంది అది' అన్నాడు షాడో.

అతను అన్నట్లుగానే అరనిమిషం తరువాత ఆ బండ ప్రక్కన వినవచ్చాయి గిట్టల చప్పుళ్ళు సన్నగా వినబడింది మేక అరుపు.

నిజంగానే చేతులు జోడించబోయిన నళినీదేవి ముందు, చిన్న చిన్న రాళ్ళతో బండలమీద కొట్టి గిట్టల చప్పుడును సృష్టిస్తూ, మేక మాదిరి శబ్దాలు చేస్తూ ప్రత్యక్షం అయ్యాడు ముఖేష్.

పట్టరాని ఆశ్చర్యంతో కనులు పెద్దవి చేసిన నళినీదేవి వంకచూసి నవ్వుతూ చేతిలోని గులకరాళ్ళను అవతల పడేశాడతను.

'మీ పద్ధతులు నాకు అర్థంకావటంలేదు. చూడగా చూడగా మీరు మావంటి మానవుల మాదిరిగా కనిపించటంలేదు' అస్పష్టమైన కంఠంతో అన్నదామె.

అంతటితో ఆపినందుకు సంతోషిస్తూ తిరిగి తమ పూర్వ స్థానానికి వెళ్ళారు షాడో, ముఖేష్ . అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి అదిరిపడ్డారు.

* * *

నెగడు ముందు అడ్డంగా పడుకోబెట్టి వున్నాడు పట్టుబడిన కోయవ్యక్తి. అతని ఎదుట నిలబడి భీకరమైన కంఠంతో ఏవో మంత్రాలు చదువుతున్నాడు నెగడు వ్యక్తుల్లో ఒకతను.

చూస్తుండగానే స్పృహను కోల్పోయి తల వాల్చేశాడు ఆ కోయ ఆపని జరిగిన మరుక్షణం అంతకుమునుపు అతన్ని బంధించి వుంచిన గుహలోనుంచి పెద్ద వెదురుబుట్ట నొకదాన్ని మోసుకు వచ్చారు మరో ఇద్దరు వ్యక్తులు. నెగడు ముందుపెట్టి దాని మూతను తొలగించారు.

జానెడు పొడుగున్న నాలుకని విరజాస్తూ ఆ బుట్టలో నుంచి బయటికి వచ్చిందొక పెద్ద కొండచిలువ. పడిపోయి వున్న కోయమీదుగా బండల్లోకి పారిపోయే ప్రయత్నం చేసింది.

చేతిలోవున్న బూడిదను దానిమీదికి విసిరి ఏవో మంత్రాల్ని చదివాడు సెగడు ముందున్న వ్యక్తి. కాలితో నేలను బలంగా తన్నాడు.

ఎవరో గట్టిగా పట్టుకొని ఆపినట్లు ఎక్కడికక్కడే ఆగిపోయిందా కొండచిలువ. తలతిప్పి మనిషి చూసినట్లే అతనికేసి చూసింది.

'మారిపోవాలి...నువ్వు మనిషిలాగా, ఆ మనిషి నీలాగా స్థానభ్రంశం చెందాలి. తనువులు మారకపోయినా మీ ఆత్మలు కలగాపులగమవ్వాలి. మారండి! ఖంగుమంటున్న కంఠంతో అంటూ మరో మంత్రాన్ని చదివాడు ఆ వ్యక్తి.

మతిపోయింది ఆ దృశ్యాన్ని చూస్తున్న షాడో ముఖేష్ లకి.

మంత్రోచ్చాటన పూర్తి అయిన మరుక్షణం మనిషి మాదిరిగానే లేచి నిలబడటానికి ప్రయత్నించింది కొండచిలువ. నిఠారుగా పైకిలేచి, అందుకు తన శరీరం సహకరించక పోవటంతో చుట్టలు చుట్టలుగా క్రిందపడి పోయింది.

అదే సమయంలో అచేతనంగా పడివున్న కోయలో కూడా చలనం వచ్చింది. మనిషి మాదిరిగా లేచి నిలబడలేదతను. పాము మాదిరిగా

నాలుకను లోపలికీ బయటికి కదిలిస్తూ, పాము మాదిరిగానే పొట్టమీద పాకుతూ బండలకేసి బయలుదేరాడు.

మనిషి మాదిరిగా నిలబడటానికి ప్రయత్నించే కొండచిలువ, పాము మాదిరి పాకే ఆ మనిషి - మతిపోయి కనులు అప్పగించి చూశారు షాడో, ముఖేష్.

'నిజమేనా రాజు? ఇది నిజమేనా?' షాడో చెవిదగ్గిర నోరుపెట్టి రహస్యంగా అన్నాడు ముఖేష్.

'వాళ్ళు ఎవరో నీకు అర్ధం అయింది. వాళ్ళు మరిడయ్య శిష్యులు. ఇటువంటి పాడుపనులు ఒక్క మరిడయ్యకే సాధ్యం' అంటున్న నళినీదేవిని మాట్లాడవద్దని సైగచేసి ముందున్న దృశ్యాన్ని చూడటంలో మునిగిపోయాడు షాడో.

పాకలేక అవస్థ పడుతున్న మనిషిని, నిలబడలేక పడిపోతున్న పాముని చూసి పెద్దగా నవ్వుతూ చప్పట్లు కొడుతున్నారు నెగడు ముందున్న వారు.

'సంధ్యా సమయంలో శ్రద్ధాశక్తులతో సాధనచేస్తే ఈ మంత్రం ఫలిస్తుందని గురువుగారు చెప్పినమాట యధార్ధమయింది. రేపు మరొక మంత్రాన్ని సాధనచేద్దాం. ఈ రోజుకు చాలు' అంటూ భగభగ లాడుతున్న నెగడుమీద నీళ్ళు కుమ్మరించాడు ఒక వ్యక్తి.

కొండచిలువని, కోయని అక్కడే వదిలి గుహలోకి వెళ్ళిపోయారు వాళ్ళందరూ. చీకట్లు చుట్టుముట్టటంతో తాము దాగున్న బండరాతిని వదిలి వెనక్కి వచ్చేశారు స్నేహితులు.

* * *

'అన్నెం పున్నెం ఎరుగని ఆ అమాయకుడిని అక్కడ వదిలి మనం వెనక్కి వచ్చేయటం మంచిదికాదు. మాకు అర్థంకాని శక్తులు విద్యలు ఎన్నెన్నో మీ వద్ద వున్నాయి. అతన్ని రక్షించలేరా?' షాడో వంక చూస్తూ దీనంగా అడిగింది నళినిదేవి.

నెగడుముందు కనిపించిన దృశ్యాన్ని గుర్తుచేసుకుంటూ ముఖేష్ వైపు చూశాడు షాడో.

'మన గురించి చాలా ఎక్కువగా ఊహించుకుంటోంది ఈ పిల్ల. మంత్రాలు తంత్రాలు మనకి రావనే సంగతి తెలియదు కాబోలు' సాలోచనగా అన్నాడు ముఖేష్.

'మంత్రాలు వచ్చినా రాకపోయినా, అక్కడ జరిగింది నిజమైనా కాకపోయినా మనం అతన్ని సేవ్ చేయటం మానవత్వం అనిపించుకుంటుంది. అందుకు ఉపాయం ఆలోచించు' అన్నాడు షాడో.

'అందుకు ఇంత ఆలోచన అనవసరం. వెనక్కిపోయి అతన్ని ఎత్తుకొచ్చేద్దాం. వాగు దగ్గిరికి తీసుకుపోయి నీళ్ళల్లో పడేస్తే మంత్రకట్టు

గింత్రకట్టు దెబ్బకు ఎగిరి పోతుంది. చలికి వణుకుతూ లేచి బయటికి వస్తాడు' అంటూ తిరిగి వెనక్కి బయలుదేరాడు ముఖేష్ . రెండు నిముషాల్లో సెగడున్న స్థలాన్ని చేరుకోవటం, ఇంకా పాములా పాకుతున్న ఆ మనిషిని భుజంమీదికి ఎత్తుకుని వెనక్కి పరిగెత్తుకు వచ్చేయటం వెంటవెంటనే జరిగి పోయింది.

తమకు దారి చూపించిన కొండవాగు అక్కడికి చాలా దూరంలో వుండటం వల్ల అరగంటపాటు వెతికి ఒక నీటిగుంటను కనిపెట్టాడు షాడో. ముఖేష్ భుజాలమీది కోయని అందులోకి నెట్టాడు.

ముఖేష్ మాటలు అక్షరాల యధార్ధం అయ్యాయి.

మంత్రకట్టు విడిపోయిందో, కనికట్టు కరిగిపోయిందోగాని చలికి వణికిపోతూ మనిషి మాదిరిగానే గుంటలో నుంచి బయటికి వచ్చి వారి ముందు నిలబడ్డాడు ఆ కోయ. చేతులు జోడించి భక్తిపూర్వకంగా నమస్కరించాడు.

అతన్ని మాములు మనిషిగా చేయగలిగినందుకు సంతోషిస్తూ, ఏదో అనబోయిన ముఖేష్ మాటలకు వెంటనే పడిందొక బ్రేక్ .

'మంత్రాల మరిడయ్య శిష్యులు సామాన్యులుకాదు. తమ మంత్రకట్టును చెడగొట్టిన విషయాన్ని వాళ్ళు తెలుసుకున్నారు. పట్టరాని ఆగ్రహంతో వాళ్ళు వచ్చి మీమీద దాడిచేయకముందే

పారిపోండి ఇక్కడి నించి. ఆలస్యం చేస్తే హతమారిపోతారు' అంటూ వినబడింది ఒక కంఠం.

నాగస్వరం విన్న నాగుపాము మాదిరి అటుకేసి తలతిప్పింది నళినీదేవి. 'నా తండ్రి కంఠం అది. నా తండ్రి మనల్ని కలుసు కోవటానికి వచ్చాడు. తండ్రీ ... తండ్రీ' అని అంటూ ఆ కంఠం వినవచ్చిన వైపు పరిగెత్తబోయింది.

నాలుగు అడుగులు కూడా వేయకముందే ఆమె దారికి అడ్డుగా ప్రత్యక్షమయ్యారు మరిడయ్య శిష్యులు.

'పట్టుకోండి ... వాళ్ళని పట్టుకోండి' అని అరుస్తూ అందరికంటె ముందుగా వస్తున్న వారి నాయకుడిని చూసి అడవి జింకలా అవతలికి పరిగెత్తాడు కోయ.

అతను అనుసరించిన మార్గానికి ఆపోజిట్ గా పరుగుతీశారు షాడో ముఖేష్ . నళినీదేవి చేయి పట్టుకుని అయిదు నిమిషాల్లో ఆ ప్రదేశానికి దూరంగా వెళ్ళిపోయారు.

'దిక్కూ మొక్కూ లేనివాళ్ళ మాదిరి ఇలా పారిపోవటం దేనికి? మీదగ్గిర వున్న అస్త్రశస్త్రాల ముందు మరిడయ్య శిష్యులు ఆగగలరా?' ఆయాసంతో వగరుస్తూ వారిని అడిగింది నళినీదేవి.

తాము అక్కడికి వచ్చింది మరిడయ్య శిష్యులతో పోరాడటానికి కాదని, ఆమె తండ్రిని కలుసుకుని తమ పనిని పూర్తిచేసు

కోవటానికనీ ఆమెకు చెప్పలేదు షాడో. దగ్గిరికి వచ్చినట్లే వచ్చి మాయమైపోయిన ఆమె తండ్రిని తలుచుకొని గాఢంగా నిట్టూర్చాడు.

'అనవసరమైన మాటలతో కాలక్షేపం చేస్తూ టైమ్ వేస్ట్ చేస్తే ఆ లఫూట్ రాస్కేల్స్ మన వెనుకే ప్రత్యక్షం అవుతారు. మరికొంచెం ముందుకుపోయి మంచి సురక్షిత స్థానాన్ని చేరుకుందాం' అంటూ ముందుకు దారితీశాడు ముఖేష్.

అర్ధరాత్రి సమయంలో వారికి ఎదురయిందొక కొండగుట్ట. దాని పైభాగంలో కనిపించిన ఒక కట్టడం దగ్గిరికి పోయారు వాళ్ళు ముగ్గురూ. శిథిలమైన ఆ కట్టడపు గోడల మధ్య సరైన చోటుకోసం వెతుక్కుంటూ వుండగా వారికి కనిపించింది ఆ విగ్రహం.

మామూలు విగ్రహం కాదది. ఏ ఉత్సవ విగ్రహం కోసం ఆ విచిత్రమైన లోకంలోకి వచ్చారో, అదే స్వరూపం నల్లరాతితో మలచటం వల్ల తయారైన కాళికావిగ్రహం అది.

ఆశ్చర్యంతో కళ్ళు అప్పగించి చూస్తూ నిలబడిన ముఖేష్ ముందుకు వచ్చాడు విగ్రహం చాటునవున్న ఒక ద్వారంలోనుంచి నళినీదేవి తండ్రి అమరేశ్వరుడు.

అతని ఆశ్చర్యాన్ని గమనించి చిన్నగా నవ్వాడు.

* * *

తండ్రిని చూసిన మరుక్షణం ఒక్క గంతులో ముందుకుపోయి ఆయన గుండెలమీద వాలిపోయింది నళినీదేవి.

'అగర్వ్యుడి చేతికి చిక్కిన నా కుమార్తెను రక్షించి నాకు ఎనలేని మేలు చేసిన మిమ్మల్ని మరిచిపోలేదు. మీ కోరిక ఎటువంటిదైనా తీరుస్తాను' షాడో వంక చూస్తూ అన్నాడు అమరేశ్వరుడు.

'మంత్రసిద్ధుల కోసం అడవులు పట్టుకు తిరుగుతున్న మీకు అగర్వ్యుడి విషయం ఎలా తెలిసింది? తెలిసిన తరువాత మీ కుమార్తెను రక్షించుకోకుండా ఎందుకు ఆగారు?' సూటిగా అడిగాడు షాడో.

నళినిదేవి తల నిమిరి తన ప్రక్కనే ఒక బండరాయి మీద కూర్చొబెడుతూ గాఢంగా నిట్టూర్చాడు అమరేశ్వరుడు.

'అగర్వ్యుడు చేసిన దురాగతం గురించి ముందుగానే తెలుసుకో గలిగినా, ఆ మంత్రాల మరిడయ్య శక్తులకు బెదిరి ముందంజ వేయలేకపోయాను' అంటున్న అతని వంక ఆశ్చర్యంగా చూసి, షాడోకి కన్ను గీటాడు ముఖేష్.

తాము తెలుసుకోవాలని అనుకుంటున్న అంశాలను గురించి అతన్ని ప్రశ్నించటానికి తగిన ఓపెనింగ్ దొరకటాన్ని వెంటనే గమనించాడు షాడో.

'మంత్రసిద్ధులు కాబట్టి మీకు అన్ని విషయాలు ముందుగానే తెలియటానికి అవకాశాలున్నాయి. మేము ఎవరిమో ఎందుకు వచ్చామో చెప్పగలరా?' అని అడిగాడు ముఖేష్ సైగను అందుకోగానే.

పది క్షణాలపాటు కనులు మూసుకొని చిరునవ్వు నవ్వాడు అమరేశ్వరుడు.

'మీరు ఎవరో ఎక్కడినుంచి వచ్చారో తెలుసుకోవటానికి నాకున్న శక్తులు చాలవు. మీకు ఒక విగ్రహం కావాలి. అది దొరికిన మరుక్షణం మీరు ఎక్కడినుంచి వచ్చారో అక్కడికి వెళ్ళిపోతారు. అవునా?'

ఎదురుచూడని విధంగా అతను తమ ఆంతర్యంలోని అంశాలను ఉటంకించేసరికి నిజంగానే ఖంగారుపడ్డారు షాడో, ముఖేష్ లు.

'అవును... ఆ విగ్రహం ఎటువంటిదో చెప్పగలరా?' తమ తత్తరపాటును కప్పి పెట్టుకోవటానికి వెంటనే ప్రశ్నించాడు ముఖేష్.

'మీ ముందున్న రాతి విగ్రహపు నకలే మీకు కావాల్సిన విగ్రహం. ఈ విగ్రహం నల్లరాతితో మలచబడింది. మీకు కావాల్సినది బంగారంతోను, వజ్రాలతోను తయారు చేయబడింది' సీరియస్ గా సమాధానం ఇచ్చాడు అమరేశ్వరుడు.

'అయితే అది ఇప్పుడు—' అని షాడో అడగబోతుండగా, తనంతటతానే సమాధానం చెప్పాడతను.

'అది ఇప్పుడు మరిడయ్య చేతిలో వున్నది. దాన్ని సంపాదించు కోవాలంటే మీరు మరిడయ్యను నాశనం చేయక తప్పదు.'

అటుతిరిగి ఇటుతిరిగి తమ కథ చివరికి మరిడయ్య దగ్గిరకే పోయి నిలబడటంతో ఏం చేయాలో తోచక ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు షాడో, ముఖేష్ లు.

'గంధక పర్వతాల మధ్యవుండే రాక్షసి కొలను వడ్డున ఏదో యాగం చేస్తున్నాడు మరిడయ్య. నా కూతుర్ని, రాజకుమారిని రక్షించేందుకు మీరు అగర్వుడిని ఎదిరించినప్పుడు అతను కల్పించుకోకపోవటానికి అది ఒక కారణం అయివుండవచ్చు అతన్ని వెంటనే మట్టుపెట్టలేకపోతే, మీకు మీ విగ్రహం లభించకపోగా, అతని మంత్రశక్తులతో పోరాడవలసి రావచ్చు అంతవరకూ ఆగి అనవసరమైన ఆపదల్ని తెచ్చుకోవటం దేనికి?' ఉన్నట్లుండి అన్నాడు అమరేశ్వరుడు.

'మమ్మల్ని ఏం చేయమని మీ సలహా?' అడిగాడు షాడో.

'తెల్లవారేసరికి రాక్షసికొలను వడ్డున వుండేందుకు మార్గం నేను చెపుతాను. వెళ్ళి ఆ దుర్మార్గుడిని హతమార్చండి. మీకు మేలు జరుగుతుంది. మాకు కూడా మంచి జరుగుతుంది' అన్నాడు అమరేశ్వరుడు.

మాయమైన విగ్రహం నరకంలో యమధర్మరాజు దగ్గిర వుందని అతను చెప్పినా అక్కడికి పోయేందుకు సిద్దంగా వున్నారు స్నేహితులు ఇద్దరూ. దగ్గిర్లో వున్న కొలను దగ్గిరికి పోయేందుకు సందేహించటం దేనికి?

తడుముకోకుండా తలలు వూపారు వాళ్ళు.

రెండు నిలువుల ఎత్తున్న కాళికాదేవి విగ్రహం చాటుకుపోయి మట్టి పాత్రల నిండా ఆహారపదార్థాలు, పాలు తీసుకువచ్చాడు అమరేశ్వరుడు. ఆకలి తీర్చుకోగానే వారిని ఆ కొండగుట్ట వెనుక భాగానికి తీసుకుపోయి, ఒక కాలిబాటను చూపించాడు.

దూరంగా నిలబడి దీనంగా చూస్తున్న నళినీదేవికి చేయి ఊపి ఆ బాటమీద ప్రయాణం ప్రారంభించారు స్నేహితులు ఇద్దరూ తూర్పుదిక్కు ఇంకో గంటకు తెల్లబడుతుందనగా పెద్ద కొలనును సమీపించి, ఒక పొదచాటున ఆగారు.

కొలను దగ్గిర మరిడయ్య ఒక్కడే వుంటాడని అనుకున్న వారిద్దరికీ ఆశాభంగమే ఎదురయింది.

వంటరిగాలేడు మంత్రాల మరిడయ్య. అతని శిష్యులు అనేకమంది అక్కడ వున్నారు. వారేకాదు - రణదుర్గంలో వుండవలసిన అగర్వుడు శతసహస్ర సంఖ్యలో వుండే సైనికుల్ని వెంట పెట్టుకొని స్వయంగా అక్కడికి వచ్చివున్నాడు.

ఖాళీగావున్న ప్రదేశాలన్నిటినీ ఆక్రమించుకునివున్న ఆ సైనిక బృందాలను చూచి నుదురు రుద్దుకున్నాడు షాడో.

ఉన్నట్లుండి కాంప్లికేట్ అయింది తమ సమస్య. అంతమంది చూస్తుండగా మరిడయ్యను మట్టు పెట్టడం సాధ్యపడుతుందా?

రాక్షసికొలను అంచుమీద పెద్ద మట్టి అరుగును నిర్మించి దానిమీద ఏవేవో మట్టిబొమ్మలను ప్రతిష్టించి ఏదో పూజ చేస్తున్న మరిడయ్య, పూజ చాలించి తనకు సమీపంలో వున్న అగర్వుడితో మాట్లాడటం మొదలుపెట్టాడు.

ఆ మాటలు తమకు వినబడే అవకాశం లేదని స్పష్టంగానే తెలిసినా, ఎంతో కొంత ప్రయత్నం చేయటం కోసం రెండు అడుగులు ప్రక్కకు వేశాడు షాడో.

రాచరికపు యుగంలోని వారు తమకంటె తెలివితేటల్లో తక్కువవారనే అభిప్రాయం అతనిలో లేకపోయినా, మామూలుగా అటువంటి పరిస్థితుల్లో తను తీసుకునే జాగ్రత్తలను గాలికి వదిలేశాడతను. దానికి తోడు ఆపదలను ముందుగానే పసికట్టి హెచ్చరికలు పంపే సిక్స్ త్ సెన్స్ పనిచేయటం మానివేసింది.

అందువల్ల అతను దాగుకొని వున్న పొదలమీద కూర్చొని కునికిపాట్లు పడుతున్న కాకులవంటి నల్లటి వింతపక్షుల్ని అబ్జర్వ్ చేయలేదతను.

అతను అవతలికి అడుగువేసిన మరుక్షణం గమనించి రెక్కల్ని తపతపలాడించింది వాటిలో ఒకటి. వికృతంగా అరుస్తూ గాలిలోకి లేచింది.

అది పైకి లేచిన మరుక్షణం ఆ చుట్టుపట్ల వున్న పొదలమీది నుంచి అటువంటి పక్షులే అనేకం పైకి వెళ్ళిపోయాయి.

వాటి కలకలాన్ని విన్న మరుక్షణం మాటల్ని ఆపాడు మరిడయ్య. గోగుపుల్ల మాదిరిగా వున్న చేతిని ఎత్తి పొదలకేసి ఊపాడు.

'మనం సూప్ లో పడ్డాం గురో...రైట్ ఎబౌట్ టర్న్ కొట్టకపోతే ఖతమైపోతాం!' ఆందోళనగా అంటూ గిరుక్కున వెనుదిరిగాడు ముఖేష్ .

అతనితోపాటు ఎగిరి వెనక్కి దూకాడు షాడో.

అంతవరకే అతనికి గుర్తువున్నది.

పరుగు ప్రారంభిస్తుండగనే రివ్వురివ్వున వచ్చి పడ్డాయి యుద్ధబాణాలు. మత్తును కలిగించే పసరు పూసివున్నది కాబోలు ఒక బాణం వంటికి తగిలిన మరుక్షణం కళ్ళు బైర్లా కమ్మి క్రిందికి వాలిపోయాడతను.

తిరిగి కనులు తెరిచేసరికి సూర్యుడు పడమటి దిశకు మరలుతూ కనిపించాడు.

* * *

ఎటువంటి మత్తుమందు అయినా తనమీద నాలుగు గంటలకంటే తన ప్రభావం చూపించలేదని షాడోకి తెలుసు. సి.ఐ.బి. లో చేరినప్పుడు ఆ విధంగా కండిషన్ చేయబడింది అతని బాడీ.

అటువంటిది ఏకంగా ఎనిమిది గంటలకు పైగా తను మత్తులో మునిగివున్నట్లు గ్రహించే సరికి చెమటలు పట్టేశాయి అరిచేతులు.

అంతలోనే ముఖేష్ విషయం జ్ఞప్తికి వచ్చి తలను ప్రక్కకు తిప్పేసరికి దగ్గర్లోనే కనిపించాడతను.

ఇద్దరినీ కలిపి రెండు పెద్ద పెద్ద స్తంభాలకు అంట కట్టించాడు మరిడయ్య. కన్ను కూడా కదపటానికి వీలులేకుండా తాళ్ళతో బంధించాడు.

దుస్తులన్నీ పెతికారుకాబోలు రెండు లిటిల్ టామీలు, రివాల్వరు, బుల్లెట్లు మొదలైన తమ సామాగ్రి అంతా మరిడయ్య పూజ చేసుకునే మట్టి అరుగు మీద పెట్టబడి వుండటం అతనికి అగుపించింది.

'రణదుర్గాధిపతి అగర్వుడు నిన్ను గుర్తుపట్టాడు. నిన్ను నరికి ముక్కలు చేయాలా వద్దా అనే అంశంమీద ఇప్పుడు చర్చ జరుగుతున్నది గమనించు' షాడోకి తెలివివచ్చిన మరుక్షణం సన్న కంఠంతో హెచ్చరించాడు ముఖేష్.

ఎండ వేడిమికి ముఖంమీదినుంచి కళ్ళలోకి జారుతున్న స్వేద బిందువుల్ని తలతోనే అవతలికి విదిలిస్తూ ఇంకో ప్రక్కకు చూశాడు షాడో.

మరిడయ్యతో పెద్ద వాగ్వివాదం జరుపుతున్నాడు అగర్వుడు. ముఖేష్ అన్నట్లుగానే మధ్యమధ్యలో షాడో కేసి చేయి వూపుతున్నాడు.

అతను అలా అరిచినప్పుడల్లా తల అడ్డం తిప్పుతున్నాడు మరిడయ్య. తన పూజావేదిక మీది బొమ్మల్ని చూపిస్తున్నాడు.

'నిన్ను తను ఆరాధించే శక్తులకు బలి ఇవ్వాలని ఆలోచిస్తున్నాడు కాబోలు. అగర్వుడి మాటల్ని వినిపించుకోవటం లేదు' అతని యాక్షన్స్ కి అర్థాన్ని క్రికెట్ కామెంటరీ మాదిరి వినిపించాడు ముఖేష్ .

బలి ప్రసక్తిని వినేసరికి వేపాకు నమిలినట్లు చేదుగా తయారైంది షాడో నోరు. మెదడు ఆలోచించటం మానివేసింది.

'మరిడయ్యే గెలిచాడు. అగర్వుడు విషణ్ణవదనంతో వెళ్ళిపోతున్నాడు' ఉన్నట్లుండి ముఖేష్ కామెంట్ చేయటంతో అటు చూశాడు షాడో.

కోపంగా అడుగులు వేస్తూ తన సైనికుల దగ్గిరికి వెళ్ళిపోతున్నాడు అగర్వుడు. వెనుతిరిగి చూడటం లేదు.

పది నిమిషాల తర్వాత, చీకట్లు రాక్షసి కొలను చుట్టూ ప్రత్యక్షం కాబోతున్న తరుణంలో మట్టి అరుగుమీదికి పోయి జపంలో కూర్చున్నాడు మరిడయ్య.

మరో అరగంట తరువాత యుద్ధానికి సిద్ధం అయినట్లు ఆయుధాలు ధరించి కొలను చుట్టూ వరుసల్లో నిలబడ్డారు అగర్వుడి సైనికులు.

పూజచాలించి పెద్ద గోనెసంచీ నొకదాన్ని అగర్వుడి చేతికి అందించాడు మరిడయ్య.

దూదితో నింపబడినట్లు లావుగా, చాలా తేలికగా వున్న ఆ గోనె సంచీని పెద్ద వెదురుగడకు వ్రేలాడదీసి ఇద్దరు సైనికులకు అప్పగించాడు అగర్వుడు. మరిడయ్యకు నమస్కరించి చీకట్లలో కలిసిపోయాడు.

అతనితోపాటు అదృశ్యం అవుతున్న అతని సైనికుల్ని గమనించి ఆశ్చర్యంగా తల విదిలించాడు ముఖేష్.

'సమ్ థింగ్ ఫిషీ ఈజ్ గోయింగ్ ఆన్ హియర్ — ఈ అగర్వుడి వ్యవహారం నాకు అనుమానాన్ని కలిగిస్తోంది. వాడు ఎవరిమీదికో దాడి చేయటానికి పోతున్నాడు' అంటూ షాడోకేసి తిరిగాడు.

అతని మాటలకు షాడో సమాధానం చెప్పకముందే వారిదగ్గిరికి వచ్చాడు మరిడయ్య.

'నా మంత్రశక్తుల్ని సహాయంగా తీసుకుని చిత్రదుర్గం మీదికి దండుపోతున్నాడు అగర్వుడు. తెల్లవారేసరికి శ్మశానం అవుతుంది చిత్రదుర్గం. అతను తిరిగి రాగానే విజయోత్సవ సమయంలో మీ ఇద్దర్నీ ఈ రాక్షసి కొలనుకు బలి ఇస్తాను' షాడో ముఖంలో ముఖం పెట్టి తన ప్లానును తెలియచేశాడు.

ఎంతోకాలంగా పళ్ళు తోముకోనట్లు మురికివాసన వేస్తున్న అతని ఊపిరిని తట్టుకోవటం అసాధ్యమై గాలిని బిగపట్టి, కళ్ళు మూసుకున్నాడు షాడో.

తన పర్సనాలటీని చూడలేక అతనలా చేశాడని అనుకుని గర్వంగా నవ్వాడు మరిడయ్య. మట్టి అరుగు మీదికి వెళ్ళి, ధ్యానంలో మునిగిపోయాడు.

'తెల్లవారేసరికి చిత్రదుర్గం నాశనం అవుతుందిట. మనం ఏమైనా చేయాలా వద్దా?' అతనికి తమ మాటలు వినబడవని నమ్మకం చిక్కిన తరువాత మెల్లిగా అడిగాడు షాడోని ముఖేష్.

'ఏంచేయాలని అన్నా ముందు ఈ బంధనాలనుండి విముక్తి పొందాలి. అందుకు మార్గం ఆలోచించు' అన్నాడు షాడో.

అటూ ఇటూ కదిలి తనను స్తంభానికి కట్టివుంచిన తాళ్ళను పరిశీలించబోయాడు ముఖేష్. అంతవరకూ ఎక్కడవున్నారోగాని, వెంటనే అతనిముందు ప్రత్యక్షం అయ్యారు మరిడయ్య శిష్యుల్లో

ఇద్దరు. అతని బంధనాలు లూజ్ కాలేదని నిశ్చయం చేసుకొని అవతలికి వెళ్ళిపోయారు.

'మనం నిజంగానే సూప్ లో పడ్డాం. మనమీద నమ్మకం లేనట్లుంది ఈ గుంటనక్కకి. బంధించటంతో ఆగకుండా కాపలా కూడా పెట్టాడు' నీరసంగా అంటూ తల వంచుకున్నాడు ముఖేష్.

అతని మాదిరిగా అనవసరమైన కదలికల్ని ప్రదర్శించలేదు షాడో. మెల్లిగా కుడికాలిని వెనక్కి వంచి, బంధించివున్న చేతుల దగ్గిరికి తీసుకుపోయాడు.

దుస్తుల్లోవున్న సరంజామానంతా వశపరుచుకున్నారుగాని మరిడయ్య శిష్యులు - అతని బూట్ల జోలికి పోలేదు. బూటుకు అడ్డంగా బిగించివున్న డాగర్ ని వాళ్ళు గమనించలేదు.

పట్టుజారి అది క్రిందపడిపోకుండా జాగ్రత్తగా బూటులోనుంచి తీసి గట్టిగా పట్టుకున్నాడు షాడో. అంచును అడ్డం తిప్పి మణికట్ల ను కట్టివున్న తాళ్ళను కోసేశాడు. చేతులు విడివడిన మరుక్షణం వాటంతట అవే జారిపోయాయి మిగిలిన బంధనాలు.

ఎక్కడో చాటున ఉండి తమను గమనిస్తున్న మరిడయ్య శిష్యులకు ఆ విషయం అంతుబట్టకుండా, అటూ ఇటూ కదిలాడు ముఖేష్ . తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లు ముఖం పెట్టి గోల స్టార్ట్ చేశాడు.

షాడో బంధనాలు సడలిపోయిన రెండో నిమిషంలో మళ్ళీ ముఖేష్ దగ్గరికి వచ్చారు ఆ శిష్యులు ఇద్దరూ. ఈ సారి లావుపాటి దుడ్డుకర్రను తెచ్చారు వాళ్ళు అతని ముఖం పగలగొట్టటానికి.

ఆ కర్ర గాలిలోకి లేస్తున్న సమయంలో అండర్ హేండ్ త్రోలో డాగర్ ని విసిరాడు షాడో.

కందిరీగలా ఝుంకారం చేస్తూ పోయి కర్రను ఎత్తిన శిష్యుడి మెడలో దిగబడింది అతని డాగర్ .

నిలుచున్నవాడు నిలుచున్నట్లే విరుచుకు పడిపోతున్న సహచరుడిని చూసి అదిరిపడ్డాడు రెండో శిష్యుడు. వెనక్కి దూకి గురువుగారి దగ్గిరికి పరిగెత్తబోయాడు.

నాలుగు అంగల్లో అతన్ని సమీపించి అమాంతం గాలిలోకి ఎగిరాడు షాడో. ఎడమ కాలిని ముందుకు జాచి అతని వెన్నుమీద ఫెడీమని తన్నాడు.

ఫట్ మని శబ్దం చేస్తూ విరిగిపోయింది అతని వెన్నెముక. జీవం లేని శరీరం ఇసుకమూట మాదిరి రాక్షసి కొలనులోకి దొర్లింది.

వెనుతిరిగి ముఖేష్ దగ్గిరికి వచ్చే వ్యవధి షాడోకి లభించలేదు. తన రెండో శిష్యుడు కొలనులోకి దొర్లిన మరుక్షణం కనులు తెరిచాడు మరిడయ్య.

'వాడి నోటిని మూయాలి రాజు...ఏదైనా మంత్రం చదివితే మన కొంపలు అంటుకుపోతాయి' ఆందోళనగా హెచ్చరిస్తున్న ముఖేష్ మాటల్ని వింటూ మరిడయ్య దగ్గిరికి జంప్ చేశాడు షాడో.

'చూడు నిన్నేం చేస్తానో ... నీ అంతుచూస్తాను ... నిన్ను' అనబోతున్నాడు మరిడయ్య.

బ్రహ్మ రాక్షసుడి మాదిరి వచ్చేసిన షాడోని తప్పించుకోవటం కోసం వేదిక చివరి భాగంలోకి జరిగాడు.

ఫ్లయింగ్ టాకిల్ ఇచ్చాడు షాడో. ఏటవాలుగా గాలిలోకి ఎగిరి అతని మెడకు వాటేసుకున్నాడు. అటునుంచి అటే కొలనులోకి దొర్లి అతన్ని నీటి అడుగున అదిమిపట్టుకున్నాడు.

గిలగిలలాడాడు మరిడయ్య. గింజుకున్నాడు.

నాలుగు నిముషాలపాటు నీటిలో వుండగల షాడో శక్తి అతని ప్రాణాలను కాపాడింది ఆ రోజున.

అంతసేపటి వరకూ ఊపిరిని బిగపట్టుకోలేక నీటిని త్రాగి కనులు తేలవేశాడు మంత్రాల మరిడయ్య. తను ఏ పిశాచాలనైతే ఆరాధిస్తాడో ఆ పిశాచ లోకంలోకి వెళ్ళిపోయాడు.

ప్రాణంలేని అతని శరీరాన్ని నీటిలోనే వదిలి వడ్డుకు వచ్చాడు షాడో. డాగర్ దెబ్బకు ప్రాణాలు కోల్పోయిన మరిడయ్య శిష్యుడి

మెడమీదినుంచి డాగర్ ని తీసుకొని ముఖేష్ బంధనాలను సడలించాడు.

కాళ్ళు చేతులు విడివడిన మరుక్షణం తూనీగ మాదిరి ఆ చుట్టుపట్ల వుండే మరుగు ప్రదేశాలన్నిటినీ వెతికి, మరిడయ్య నిర్మించుకున్న మట్టివేదిక ప్రక్కనుంచి మాయం అయిపోయిన తమ ఎయిర్ బేగ్ ని బయటికి లాగాడు ముఖేష్. అందులో భద్రంగా వున్న కాళీ విగ్రహాన్ని చూసి తేలికగా నిట్టూర్చాడు.

'వచ్చిన పని అయిపోయింది గదా. ఇక ఇంటికి వెళ్ళేదారి వెతుకు' ఒకచోట కూర్చుంటూ అన్నాడు షాడో.

'అందుకు ఆ అమరేశ్వరుడి సహాయం పొందక తప్పదు. పోదామా అతని దగ్గిరికి?' అంటూ వుండగా గుర్తుకువచ్చింది ముఖేష్ కి, అగర్వుడు చిత్రదుర్గం మీదికి దండు వెళ్ళిన సంగతి.

అప్పుడే షాడోకి కూడా ఆ మాట మనసులో మెదలడం వల్ల చెంగున లేచి ప్రయాణానికి సిద్ధం అయినాడు.

మట్టి వేదిక మీది తమ సరంజామానంతా తీసుకుని వాళ్ళు చిత్రదుర్గం వైపు పరుగు ప్రారంభించేసరికి రాత్రి రెండో ఝాము కూడా గతించింది.

* * *

తూర్పు దిక్కు ఇంకో ఘడియ సేపటికి తెల్లబడుతుందనగా చిత్రదుర్గం కోట ముఖద్వారం ముందు తన సైనికుల్ని నిలబెట్టాడు అగర్వుడు.

మంత్రాల మరిడయ్య తనకు ఇచ్చిన గోనెసంచిని వెదురుగడ చివరిభాగంలో ప్రేలాడదీసి కోట తలుపులకు దగ్గిరిగా నిలబెట్టాడు.

'మరిడయ్య వశపరుచుకున్న భూత ప్రేత పిశాచాలన్నీ ఈ సంచిలో బంధించబడివున్నాయి. సంచి మూత విడివడిన మరుక్షణం బయటికి వచ్చి నిలబడివున్న ప్రతి ప్రాణిని విరుచుకు తింటాయి' తన సైనికులందరి వంకా చూస్తూ చెప్పాడతను.

'తెల్లతెల్లవారుతుండగా చిత్రదుర్గంలోని జనాభా అంతా నిద్రలు లేచి ఇళ్ళల్లో నుంచి బయటికి వస్తారు. ఆ సమయంలో సంచి మూతిని వదులు చేద్దాం. వదులు చేసిన మరుక్షణం మీరందరూ నేలమీద బోర్లా పడుకోండి. నిలుచున్నవారిని ఆ భూతాలు విరుచుకు తింటాయనే సంగతిని మరిచిపోకండి. సిద్ధంగా వుండండి' అంటూ అందరినీ ఒకటికి రెండుసార్లు హెచ్చరించి, వెలుగురావటం కోసం ఎదురుచూడసాగాడు.

అతను ఆఖరిసారి అందర్ని హెచ్చరిస్తున్న సమయంలో అక్కడికి చేరుకున్నారు ఊపిర్లు బిగపట్టి ఆఘుమేఘూలమీద పరిగెత్తుకు వచ్చిన షాడో ముఖేష్ లు అతని మాటల్ని విని నిర్ఘాంతపోయారు.

'తెల్లవారేసరికి చిత్రదుర్గం శ్మశానవాటిక అవుతుందని ఆ మరిడయ్య చెప్పిన దాంట్లో అసత్యం ఏమీలేదు. పరిస్థితి మనచేయి దాటిపోయింది' గాలిలో వేలాడుతున్న గోనెసంచివంక చూస్తూ బాధగా అన్నాడు ముఖేష్.

తూర్పు దిక్కున తొలివెలుగు ప్రత్యక్షం అవుతూ వుండటాన్ని గమనించి, చటుక్కున తన డాగర్ ని అందుకున్నాడు షాడో.

'గెట్ రెడీ ముఖేష్ ' అని ముఖేష్ ని హెచ్చరిస్తూ, శరీరంలోని శక్తినంతా కుడి చేతిలోకి తెచ్చుకుని డాగర్ ని విసిరాడు.

గింగిరాలు తిరుగుతూపోయింది డాగర్ . చీకట్లు పూర్తిగా విడివడకపోవటం వల్ల ఎవరికీ కనిపించలేదది. సూటిగా వెళ్ళి గోనెసంచి మధ్యభాగంలో దిగబడింది.

రబ్బర్ బెలూన్ ఠప్ మని శబ్దం చేసినట్లు సవ్వడి చేసింది గోనెసంచి, తన ఉబ్బరాన్ని కోల్పోయి వ్రేలాడబడింది.

అందులోనుంచి వెలువడిందొక నల్లటిపొగ. చూస్తూవుండగానే అవి భయంకరమైన ఆకారాలుగా రూపాంతరం చెంది, రాతి బొమ్మల మాదిరి నిలుచుని వున్న అగర్వ్యాడి సైనికుల మీద విరుచుకు పడింది.

అగర్వ్యాడి సైగకోసం ఎదురుచూస్తూ వుండటం వల్ల క్రింద పడుకోవాలని నిలిచి వుండకూడదని మరిచిపోయారువాళ్ళు. తూర్పు

దిక్కువైపు చూస్తూ వుండటం వల్ల గోనెసంచి పంక్చర్ అవటాన్ని అగర్వుడు గమనించలేదు. గమనించేసరికి ఆలస్యం అయిపోయింది.

వికృత ధ్వనులు చేస్తూ, వికటాట్టహాసాలతో అందరి గుండెలను కలియచేస్తూ అతని అనుచరుల్ని విరుచుకు తినటం ప్రారంభించింది మరిడయ్య పంపిన పిశాచగణం.

'పడుకోండి...నేలమీద బోర్లా -పడుకోండి' అని హెచ్చరిస్తూ వెనక్కి పరిగెత్తబోయాడు అగర్వుడు.

అందరినీ హెచ్చరించే ప్రయత్నంలో తను ఆ హెచ్చరికను పాటించటం మరిచిపోయాడు.

గుండెల జలదరించేలా గర్జిస్తూ అతని వెన్నుమీదికి దూకింది ఒక పిశాచం. చురకత్తులవంటి కోరల్ని అతని మెడకు ఆనించి ఫటుక్కున తలను వేరు చేసేసింది.

అర్థంలేని పగతో చిత్రదుర్గపు అంతం చూడాలని మరిడయ్యతో చేతులుకలిపిన అగర్వుడు ఏం జరుగుతున్నదో అర్థం అయ్యేలోపు గానే హతమారిపోయాడు.

సరైన ఆజ్ఞలు జారీచేసే నాయకుడు లేకపోవటంవల్ల, అంతకు ముందు చేయబడిన హెచ్చరికల్ని మరిచిపోయి, మూడొంతులమంది నాశనం అయిపోయారు అతని సైనికులు. మిగిలినవారు ఎటుపోయారో ఎవరికీ తెలియనంత దూరం పారిపోయారు.

వెలుగురేకలు నేల నాలుగుచెరుగులా పరుచుకుంటున్న సమయంలో తమ భీకర స్వరూపాల్ని వదిలి పొగరూపాన్ని పొందాయి మరిడయ్య పంపించిన పిశాచగణాలు. ఎండ తగిలిన పొగమంచు తనంతటతనే గాలిలో కరిగి మాయం అయిపోయినట్లు క్షణాలమీద అంతర్ధానం అయింది ఆ పొగ.

తలలులేని మొండేలు, మొండాలు కనిపించని తలలు, కత్తులతో చీరినట్లు భీభత్సంగా తయారైన దేహాలతో శ్మశాన వాటిక కంటె వెయ్యిరెట్లు భయంకరంగా తయారయింది చిత్రదుర్గ పట్టణ ద్వారం.

తెల్లవారగానే నిద్రలు లేచి అలవాటు ప్రకారం కోట బయటికి రాబోయిన పౌరులు కొంతమంది ఆ దృశ్యాన్ని చూసి అదిరిపోయారు. స్పృహలు తప్పి విరుచుకుపడిపోయారు కొందరు. వెర్రిగా అరుస్తూ పట్టణంలోకి పారిపోయారు మరికొందరు.

అగర్వ్రాడి శరీరం కోసం వెదికారు షాడో, ముఖేష్‌లు. ఎంత వెదికినా అది కనిపించకపోవటంతో, ఆ ప్రయత్నాన్ని విరమించుకుని మెల్లిగా పట్టణంలోకి అడుగుపెట్టారు.

* * *

'నిద్రలు లేవాలి. అన్నలు త్వరగా నిద్రలు లేస్తే మంచి శుభవార్తలు రెండు చెపుతాను' అంటూ చంద్రిక పెద్దగా హెచ్చరించటంతో బద్దకంగా వళ్ళు విరుచుకుంటూ మంచంమీద లేచి కూర్చున్నాడు షాడో.

'ముందుగా ఆ చెప్పేవేవో చెప్పమను. ఆ తర్వాత నిద్రలేవాలో వద్దో నిర్ణయించుకుంటాను' లేవటం ఇష్టం లేని ముఖేష్ సన్నగా గొణిగాడు.

'అడవుల్లో తిరిగే అమరేశ్వరుడు పట్టణంలోకి వచ్చాడు. మరిడయ్యను చంపింది ఎవరో, పట్టణం ముందు భీభత్సకాండ ఎందుకు జరిగిందో మహారాజు గారికి వివరంగా చెప్పాడు. అగర్వుడి అహం అణిచి చిత్రదుర్గానికి ఎనలేని మేలుచేసిన ఇద్దరు వీరాధివీరులను సత్కరించటం కోసం మహారాజు స్వయంగా మా ఇంటికి వస్తున్నారట. భద్రగజం మీద ఊరేగింపుగా రాజసభకు తీసుకుపోతారట.' ఊపిరి తీసుకోకుండా చెప్పి, తుర్రున పారిపోయింది చంద్రిక.

అదిరిపడి లేచి కూర్చున్నాడు ముఖేష్.

'ఈ అమరేశ్వరుడి నోరు పెద్ద గంగాళం మాదిరి కనిపిస్తోంది. నోటికి వచ్చిన మాటలన్నీ చెప్పి మన కొంప ముంచటానికి చూస్తున్నట్లున్నాడు...! అని వాపోతున్న సమయంలోనే ముఖమంతా నవ్వులమయం చేసుకుని లోపలికి వచ్చాడు నిశంభుడు.

'ఎందుకా నవ్వు?' అనుమానంగా చూస్తూ అడిగాడు ముఖేష్.

'ఎందుకో తర్వాత తెలుస్తుంది గాని, ముందు కాలకృత్యాలు తీర్చుకొని సిద్ధంకండి, మహారాజులు రాజభవనం నుండి బయలు

దేరారని వార్త వచ్చింది' అంటూ ఆపైన ఒక్కమాట కూడా మాట్లాడకుండా వెళ్ళిపోయాడు నిశంభుడు.

అమరేశ్వరుడిని నోటికి వచ్చిన తిట్లతో దీవిస్తూ కాలకృత్యాలు తీర్చుకున్నాడు ముఖేష్. దుస్తులు ధరించి సిద్ధమయ్యే సమయానికి భూపతి ఇంటి ముందు ఆగింది మహారాజు వీరసేనుడు అధిరోహించివున్న భద్రగజం.

'నాకు ఇంతకంటె గౌరవం ఏంకావాలి? మహారాజంతటివాడు స్వయంగా నా ఇంటి ముందుకు వచ్చాడంటే - నాకంటె అదృష్ట వంతుడు ఇంకెవరుంటారు?' ఆనందభాష్పాలు విడుస్తూ అంటున్న భూపతి వంక గుర్రుగా చూసి వాకిట్లోకి పోయాడు ముఖేష్.

'అమరేశ్వరుడు మాకు అన్ని విషయాలు చెప్పాడు. అసలు విషయం అర్థంకాక నీమీద రాజద్రోహ నేరం మోపినందుకు మన్నింపు కోరుకుంటున్నాము' అంటూ అతనికి, షాడోకి స్వయంగా చేయి అందించి భద్రగజం మీద కూర్చోబెట్టుకున్నాడు మహారాజు రాజసభకు తీసుకుపోయి సముచిత స్థానంలో ఆశీనుల్ని చేశాడు.

'ఈ మర్యాదలన్నీ చూస్తుంటే నాకేదో భయంగా వుంది' షాడో చెవిలో గుసగుసలాడాడు ముఖేష్.

అతను భయపడినట్లే జరిగింది అరగంట తరువాత.

రాజకుమారి రంజనిని ముఖేష్ కి, రాజనర్తకి నళినీదేవిని షాడోకి ఇచ్చి వివాహం చేసి వివాహసమయంలో కానుకగా వారిద్దరికీ రణదుర్గాన్ని ఇచ్చివేస్తున్నట్లు ప్రకటించాడు మహారాజు.

షాడో గనుక పట్టుకోకపోయినట్లయితే తన ఆసనం మీదినించి క్రిందపడిపోయి వుండేవాడు ముఖేష్.

* * *

'కాళికాదేవి ఉత్సవ విగ్రహంతో మన కాలంలోకి వెళ్ళిపోయే మార్గం చెప్పుతాడని అనుకుంటే మెలిక ఇలా వేశాడు ఈ అమరేశ్వరుడు. ఇప్పుడు ఏం చేద్దాం గురూ?' నీరసంగా అంటున్న ముఖేష్ మాటలకు సమాధానం చెప్పకుండా అడుగు ముందుకు వేశాడు షాడో.

వివాహ విషయం ప్రకటించబడిన తరువాత వాయిదా పడింది రాజసభ. బ్రహ్మాండమైన విందు జరిగింది. విందు అనంతరం తన మెడలోని పతకాన్ని మహారాణి స్వయంగా తన స్వహస్తాలతో ముఖేష్ కి కానుకగా ఇచ్చివేసింది, 'కాబోయే అల్లుడికి కన్యారత్నం కంటె ముందుగా ఇచ్చుకుంటున్న బహుమతి' అంటూ.

విందు తర్వాత అలసట నటించి భూపతి ఇంటికి వెళ్ళిపోయారు స్నేహితులు ఇద్దరూ. వంటరిగా కూర్చుని తమ పరిస్థితిని అంచనా వేసుకోవటం వారి ఉద్దేశ్యం. కాని ఇంటికి వెళ్ళిన అర్ధఘుడియకల్లా ఇద్దరు అంతఃపుర దాసీలు వారివద్దకు వచ్చారు.

'రాజకుమారి, రాజనర్తకి ఈ రోజు సాయంసమయంలో అంతఃపురోద్యానవనంలో మీ దర్శనాన్ని ఆపేక్షిస్తున్నారు' అంటూ వార్తలు మోసుకువచ్చారు.

ఆ కన్యారత్నాలకు ఎదురుపడి అటోఇటో తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చి ఉద్యానవనానికి బయలుదేరారు స్నేహితులు ఇద్దరూ.

అంతఃపురోద్యానవన ద్వారం ముందు కాపలావుండాల్సిన భటులు కనిపించటంలేదు ... ఆ చుట్టుపట్ల నరమానవులు ఎవరూ నిలబడినట్లు చిహ్నాలు అగుపించటంలేదు.

'ఇదేదో విచిత్రంగా వుంది. వంటరిగా కలుసుకోవటమంటే - పిట్ట కూడా చుట్టుపట్ల లేకుండా కలుసుకోవటమా? వరస చూస్తుంటే ఇక్కడికిక్కడే తమ మెడల్లో తాళిబొట్లు కట్టేయమనేటట్లు కనిపిస్తుంది.' ఉద్యానవనంలో అడుగుపెట్టిన తరువాత చుట్టూ చూస్తూ అన్నాడు ముఖేష్. అంటూ వుండగానే అతనికి అగుపించింది ఒక పొదచాటున చిన్న కదలిక.

'గెట్ రెడీ రాజూ... సమ్ థింగ్ ఈజ్ రాంగ్ హియర్ ' అని షాడోని హెచ్చరిస్తూ ఎగిరి వెనక్కి దూకాడతను.

దూకుతూ వుండగానే ముసుగులు ధరించి అతని మీదా, షాడో మీదా కలబడ్డారు పాతికమంది అగంతకులు.

'అగర్వుడు హతమారిపోయాడని అనుకుంటే వీళ్ళెవరు?' ఆశ్చర్యంగా అంటూ ఆత్మరక్షణ చేసుకోవటంలో బిజీ అయిపోయాడు ముఖేష్.

మీదికి వచ్చిన నలుగురు ఆగంతకుల్ని భుజం మీదుగా అవతలికి విసిరి, మరో ఇద్దరి ముఖాలు పగిలిపోయేటట్లు కిక్స్ కొట్టాడు షాడో. ప్రక్కనే ప్రత్యక్షం అయిన మరో వ్యక్తి దుస్తుల్ని పట్టుకొని ముందుకు గుంజుతుండగా జారిపోయింది ఆ వ్యక్తి ముఖానికి అడ్డుగావున్న ముసుగు.

తమ రహస్యం బట్టబయలు అయ్యేసరికి దెబ్బతిన్న పాములా బుసకొట్టాడు ముసుగు తొలగిపోయిన మంత్రి కుమారుడు జయపాలుడు.

'ఎక్కడినించో వచ్చిన అనామకులకు మా ఆడబడుచుల్ని ఇచ్చి వివాహం చేయటం, రాజ్యాలకు రాజ్యాలు కట్టబెట్టడం - చూస్తూ వూరుకోవటానికి మేము గాజులు తొడిగించుకోలేదు. మీ అంతం చూస్తాము' అంటూ రెచ్చిపోయి ఫైటింగ్ మొదలుపెట్టాడు.

జయపాలుడి ఐడెంటిటి బయటపడిన మరుక్షణం తమ ముసుగుల్ని కూడా తీసివేశారు మిగిలిన అగంతకులు.

యువరాజు శ్రీసేనుడిని, సర్వసైన్యాధిపతిని, అంగరక్షక దళాధిపతిని వారి అనుచరుల్ని గుర్తుపట్టి ఆశ్చర్యంగా చూస్తున్న షాడో భుజం మీద పొడుచుకున్నది ఒక బరిశె.

తన అజాగ్రత్తకు తననుతానే నిందించుకుంటూ ఎగిరి ప్రక్కకు దూకబోయిన అతని తలను ఠపీమని మ్రోగించింది ఒక దుడ్డుకర్ర.

కనులముందు పంచరంగుల నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా, క్రిందికి వాలిపోయాడు షాడో. తనతోపాటు ముఖేష్ కూడా పడిపోవటాన్ని చూసి బాధతో మెలితిరిగిపోయింది అతని అంతరంగం. పడుతూ పడుతూ వున్న సమయంలో కూడా ఉత్సవ విగ్రహం వున్న ఎయిర్ బేగ్ ని అతను గట్టిగా పట్టుకొని మరీ పడటం ఒక్కటే అతనికి కాస్తంత తృప్తిని కలిగించిన విషయం - ఆ సమయంలో.

ఆ తరువాత అంతా చీకటి. ఏదో అగాధంలోకి దొర్లామన్న అనుభూతి. స్పృహ తెలిసిన తరువాత కనులు విప్పి చూసిన అతనికి - ఉద్యానవనం కనిపించలేదు. రాజకుమారుడు, మంత్రి కుమారుడు మొదలైన వారెవరూ అగుపించలేదు.

భుజం మీద తగిలిన దెబ్బ బరువుచేసి చేయి చచ్చుపడి పోయినట్లు అనిపిస్తోంది. క్రిందపడే సమయంలో కాలికి కూడా గాయం అయినట్లుంది - కాలు కూడా పనిచేయటం లేదు.

'ఎక్కడ వున్నాను నేను?' అని అడుగుతూ లేవబోయిన అతన్ని మృదువుగా వెనక్కి నెట్టింది ఒక వృద్ధురాలు.

అదిరిపడి నుదురు రుద్దుకున్నాడు షాడో.

ఆమె ... ఆమె ... రాచరికపు యుగంలోని మనిషికాదు. షిరోనా అరణ్యాలలోకి పోవద్దని తమను హెచ్చరించిన మర్రిచెట్టు వృద్ధురాలు.

అతని మనసులోని ఆలోచనలు తనకు అర్థం అయినట్లు మృదువుగా నవ్వి, బాగావున్న భుజాన్ని తట్టిందామె.

'వద్దు వద్దన్నకొద్దీ పోయి, నరమాంసాన్ని ఆరగించే విషపు వృక్షం చేతిలో చిక్కుబడ్డావు. నీ భుజంలోకి విషం ప్రవేశించింది. తగ్గటానికి నాలుగైదు రోజులు పడుతుంది. నీ జతగాడికి నీ మాదిరిగా పెద్ద దెబ్బలు తగలలేదుగాని, కాస్తంత మతిస్థిమితం తప్పింది. రాజకుమారి, రాజనర్తకి రణదుర్గం అని కలవరిస్తున్నాడు' అంటూ ప్రక్కకి చూపింది.

ఉత్సవ విగ్రహం వున్న ఎయిర్ బేగ్ ని గట్టిగా కౌగిలించుకుని ఒక బాట మధ్యలో బాసిపట్టు వేసుకుకూర్చున్న ముఖేష్ కనిపించేసరికి కొండంత బరువు దిగిపోయినట్లయింది షాడో గుండెలమీదినించి.

'వచ్చేశాం రాజు మన కాలంలోకి... ఆ కాలంలోనే సెటిల్ అయిపోకుండా క్షేమంగా వడ్డున పడినందుకు దైవానికి, మన కలకత్తా కాళికి నమస్కరించుకో' అని చేయివూపాడు.

'తమకు ఎదురైన అనుభవాలకు అర్థాన్ని ఆలోచించబోతున్న షాడో భుజం తట్టి తల అడ్డం తిప్పింది వృద్ధురాలు.

'చిత్ర విచిత్రాలున్న షిరోనా అరణ్యంలో ఎన్నో అనుభవాలు ఎదురవుతుంటాయి. వాటికి కారణాలు, కారణాంతరాలు వెదుక్కోవటంగాని, అవి నిజమని భ్రమపడటంగాని మంచిదికాదు. ఒక మంచి కల వచ్చిందని అనుకుంటే ఏ బాధ వుండదు' అని ఎక్స్ ప్లెయిన్ చేసింది.

మొట్టమొదటిసారిగా సిగరెట్ కాల్చుకోవాలన్న కోరిక మనసులో అడుగుపెట్టేసరికి అందుకు మార్గం గోచరించక నిద్రలోకి జారిపోయాడు షాడో.

వళ్ళోవున్న ఎయిర్ బేగ్ ని భుజానికి తగిలించుకొని, పాంటు జేబులోని బీపర్ మెషీన్ ని బయటికి తీశాడు ముఖేష్. దానిమీది బటన్ నొక్కి వృద్ధురాలి గుడిశె ముందు పెట్టాడు.

దాని రిసీవర్ ఒకటి గ్రెగరీ దగ్గిర వుంది. సిగ్నల్స్ అందగానే ఏదో ఒక విధంగా అక్కడికి వచ్చేస్తాడతను.

తమకు ట్రాన్స్ పోర్టేషన్ అరేంజ్ చేసి భారతదేశం వెళ్ళిపోయే ఏర్పాట్లు చేస్తాడు.

రణదుర్గాన్ని గురించి, చిత్రదుర్గాన్ని గురించి తమ రిపోర్టుల్లో వ్రాస్తే సి.ఐ.బి. డైరెక్టర్లు యాక్సెప్ట్ చేస్తారా?

గ్రెగరీ రాకకోసం ఎదురుచూస్తూ గుడిశె ముందు కూర్చున్నాడు ముఖేష్. నిద్రమాత్రం పోలేదతను. నిద్రపోతే తిరిగి చిత్రదుర్గంలో కళ్ళు తెరవాల్సి వస్తుందనే భయం అందుకు కారణం కావచ్చు.

—: జైహింద్ :—